www.prajajwalanews.com
# ప్రజాజ్వాల
తెలుగు దినపత్రిక




హైదరాబాద్ | శుక్రవారం, ఆగస్టు 28, 2026 | చీఫ్ ఎడిటర్ : మాదగాని సుగ్రీవుడు | సంపుటి:11 | సంచిక : 361 | పేజీలు: 8 | వెల : రూ.4

# మీరాలం చెరువుకు మహర్దశ

**పర్యాటక, వినోద కేంద్రంగా సమగ్ర అభివృద్ధి**

**కుటుంబాలతో రోజంతా గడిపేలా సరికొత్త రూపు**

**ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం**

**బోటింగ్, జల క్రీడలకు అవకాశాల పరిశీలన**

**ఐలాండ్లలో ప్రకృతి ఆధారిత పర్యాటక సదుపాయాలు**

**జూతో అనుసంధానించి ప్రత్యేక పర్యాటక అనుభవం**



హైదరాబాద్: చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీరాలం చెరువుకు కొత్త రూపు రానుంది. కుటుంబ సమేతంగా వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ రోజంతా గడిపేలా ఈ ప్రాంతాన్ని పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం మీరాలం చెరువును ఆకస్మికంగా సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువు చుట్టూ చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు నిర్మాణంలో ఉన్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జిని కూడా పరిశీలించారు. మీరాలం చెరువు పునరుజ్జీవం, పరిసర ప్రాంతాల అభివృద్ధి, చెరువులోని ఐలాండ్ల అభివృద్ధి, ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం వంటి అంశాలను

(మిగతా 2వ పేజీలో)



# ముంచెత్తిన మృత్యు ప్రవాహం



**నేపాల్‌లో 392కు చేరిన మృతుల సంఖ్య**

**30 దేశాలకు చెందిన 1,500 మందికిపైగా గల్లంతు**

**ఆచూకీ లేని వారిలో 288 మంది భారతీయులు**

**గల్లంతైన వారిలో కొందరు తెలుగువారూ..**

**టిబెట్‌లోనూ వరద, బురద బీభత్సం**

**కొనసాగుతున్న సహాయక, గాలింపు చర్యలు**

కాఠ్‌మాండు: నేపాల్‌లో వరద, బురద సృష్టించిన విధ్వంసం అంతకంతకూ వెలుగులోకి వస్తోంది. ఎక్కడ చూసినా మృత్యువు ఛాయలే కనిపిస్తున్నాయి. గురువారం వెలుగులోకి వచ్చిన దృశ్యాలు విపత్తు తీవ్రతను కళ్లకు కట్టాయి. రసువా జిల్లాలో కొండచరియలు, మంచు, రాళ్లు, శిథిలాలు లిండే నదీ ప్రవాహానికి అడ్డుగా నిలవడంతో అక్కడ తాత్కాలికంగా భారీ నీటి నిల్వ ఏర్పడింది. ఆ అడ్డంకి ఒక్కసారిగా తొలగిపోవడంతో వరద, బురద ఉద్ధృతంగా దిగువ ప్రాంతాలపైకి దూసుకొచ్చింది. భోటే కోశీ, త్రిశూలి నదుల్లో ప్రవాహం ఒక్కసారిగా పెరిగి పలు జిల్లాలను ముంచెత్తింది. భారీ ప్రవాహానికి భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీసిన ప్రజలను సైతం వరద ప్రవాహం చుట్టుముట్టింది. జంతువులు, చెట్లు సైతం వరదలో కొట్టుకుపోయాయి. ఈ విపత్తు ప్రభావం టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. భారీగా వరద నీరు, బురద పోటెత్తడంతో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో కలిపి మృతుల సంఖ్య గురువారానికి 392కు చేరింది. గల్లంతైన వారి సంఖ్య 1,468గా అధికారులు వెల్లడించారు. నేపాల్‌లోనే ఇప్పటివరకు 389 మృతదేహాలు లభ్యమయ్యాయి. టిబెట్‌లో మరో ముగ్గురు మృతి చెందారు. నేపాల్‌లో

(మిగతా 2వ పేజీలో)




**ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేదే అధికారం..**

## కానీ తగ్గిన సీట్లు: మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే

**ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేకు 326 సీట్లు వస్తాయని అంచనా**

**జనవరి సర్వేతో పోలిస్తే ఎన్డీయే కూటమికి 26 సీట్లు తగ్గుదల**

**ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీకి 49 శాతం మంది మద్దతు**

**ఇండియా కూటమికి 185 స్థానాలు దక్కుతాయని వెల్లడి**



## సోదరుడు కేటీఆర్‌పై కవిత తీవ్ర అసంతృప్తి

**రాఖీ పండుగకు కూడా అందుబాటులో ఉండకపోవడంపై ఆవేదన**

**ఆడబిడ్డగా తన ఆత్మగౌరవం దెబ్బతిన్నదని భావోద్వేగ వ్యాఖ్య**

**బీఆర్ఎస్‌లో అంతర్గత సంక్షోభం వల్లే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శ**

**హరీశ్ రావు బీజేపీ మద్దతుతో పార్టీని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని ఆరోపణ**

**నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన**

# 29మంది గల్లంతు

**నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు**

**ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతు**

**యాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలు**

**బాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు**

**కేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయం**



నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు-ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్

(మిగతా 2వ పేజీలో)



# పాలిటెక్నిక్ విద్యార్థులపై ఎందుకీ ఉక్కుపాదం?

**విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా?.. హరీశ్‌రావు ఆగ్రహం**

**ఆందోళన చేస్తున్న వారి గొంతు నొక్కుతారా? అని ప్రశ్న**

**జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్**

**ఏపీ, ఢిల్లీ తరహాలో నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచన**

**విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడమే తప్పా? అంటూ నిలదీత**

**హనుమకొండ కలెక్టరేట్ వద్ద ధర్నా.. అరెస్టు**

వరంగల్: పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా వెళ్లిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ చర్యపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా? తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతు నొక్కుతారా?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీవో 97ను వెంటనే రద్దు చేసి,

(మిగతా 2వ పేజీలో)

# మీరాలం చెరువుకు మహర్దశ

సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో చెరువు నుంచి మూసీ నదిలోకి నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని చెప్పారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను గణనీయంగా మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. మీరాలం చెరువును జల వినోదాలకు అనువైన ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, సాహస క్రీడలకు అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చెరువు చుట్టూ ఆహార కేంద్రాలు, పచ్చని ఉద్యానవనాలు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద కార్యకలాపాల కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాదచారులకు అనుకూలంగా నడక మార్గాలు, విశాలమైన ప్రజా ప్రదేశాలను అభివృద్ధి చేయడంతో పాటు సందర్శకుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని సీఎం తెలిపారు. చెరువులోని ఐలాండ్లను కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. వివాహాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేలా ప్రత్యేక వేదికలను అభివృద్ధి చేసి మీరాలంను ప్రముఖ కార్యక్రమాల గమ్యస్థానంగా తీర్చిదిద్దే అంశంపై దృష్టి పెట్టాలని చెప్పారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల కల్పనలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో వివిధ ప్రాజెక్టులను చేపట్టి స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మీరాలం చెరువుకు సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో అనుసంధానం కల్పించడంపై కూడా సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. జూ సందర్శనతో పాటు మీరాలం చెరువు ప్రకృతి అందాలు, పర్యాటక సదుపాయాలు, కుటుంబ వినోదాన్ని కలిపి ఒకే సమగ్ర పర్యాటక అనుభవంగా అందించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రస్తుతం రూపుదిద్దుకుంటోందని అధికారులు సీఎంకు వివరించారు.



# ముంచెత్తిన మృత్యు ప్రవాహం

గల్లంతైన వారిలో 288 మంది భారతీయులు ఉన్నట్లు భారత విదేశీ వ్యవహారాలశాఖ వెల్లడించింది. వారిలో కొందరు తెలుగువారు కూడా ఉన్నట్లు తెలిపింది. మరో 200 మంది భారతీయులు టిబెట్ ప్రాంతంలో చిక్కుకున్నట్లు పేర్కొంది. మానసరోవర్ యాత్రకు వెళ్లిన పలువురి ఆచూకీ కూడా లభించలేదు. తమిళనాడుకు చెందిన 37 మంది ఒక పర్యాటక సంస్థ ద్వారా, మరో 49 మంది మరో సంస్థ ద్వారా యాత్రకు వెళ్లినట్లు అధికారులు తెలిపారు. కర్ణాటకకు చెందిన 13 మంది కూడా గల్లంతైన వారిలో ఉన్నారు. నేపాల్ పర్యాటకశాఖ ప్రకారం 590 మంది పర్యాటకుల జాడ తెలియడం లేదు. వీరిలో 476 మంది విదేశీయులు కాగా, 114 మంది నేపాలీలు ఉన్నారు. గల్లంతైన పర్యాటకులు 30 దేశాలకు చెందినవారని అధికారులు తెలిపారు. వేలాది కుటుంబాలు ఇళ్లను కోల్పోయాయని, అనేక మంది గల్లంతయ్యారని నేపాల్ అధికారులు వెల్లడించారు. జల విద్యుత్తు ప్రాజెక్టులు, కస్టమ్స్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 160 మంది ఉద్యోగుల ఆచూకీ కూడా తెలియడం లేదని పేర్కొన్నారు. విపత్తు కారణంగా మధ్య నేపాల్‌లో మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 35 వంతెనలు, 45 సస్పెన్షన్ వంతెనలు, దాదాపు 40 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమయ్యాయి. కాఠ్‌మాండూను ఇతర ప్రాంతాలతో కలిపే ప్రధాన రహదారి కూడా తీవ్రంగా దెబ్బతింది. చితవాన్ జిల్లాలో అత్యధికంగా 132 మృతదేహాలు లభ్యమయ్యాయి. తూర్పు నవాల్‌పరసీలో 62, ధాడింగ్‌లో 27, గూర్ఖాలో 20, రసువాలో 17, పశ్చిమ నవాల్‌పరసీలో 15, నువాకోట్‌లో 12 మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. ఇప్పటివరకు 84 మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు భారత విదేశీ వ్యవహారాలశాఖ తెలిపింది. వీరిలో త్రిశూల్ విద్యుత్తు ప్రాజెక్టు వద్ద పనిచేస్తున్న 63 మంది ఉద్యోగులు ఉన్నారు. సహాయక సిబ్బంది 27 మంది విదేశీ పర్యాటకులను రక్షించగా, వారిలో 11 మంది భారతీయులు ఉన్నారు. తమవారి ఆచూకీ కోసం కాఠ్‌మాండూలోని త్రిభువన్ ఆసుపత్రి వద్ద వందలాది మంది బంధువులు, కుటుంబసభ్యులు గుమిగూడారు. భారీ విపత్తు నేపథ్యంలో భారత్ సహాయక చర్యలను ముమ్మరం చేసింది. బుధవారం నుంచి నేపాల్‌కు 47.5 టన్నుల అత్యవసర సామగ్రిని పంపించింది. పరిస్థితిపై విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ సమీక్ష నిర్వహించారు. సహాయక, గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయి.

### మరో ముప్పు హెచ్చరిక

ఇప్పటికే వరదలతో అల్లాడుతున్న నేపాల్‌కు మరో ముప్పు పొంచి ఉందని చైనా హెచ్చరించింది. భోటే కోశీ నదికి దిగువన రసువా జిల్లాలో ఆనకట్టను తలపించే భారీ మట్టి, రాళ్ల నిర్మాణం ఏర్పడిందని, దాని వెనుక పెద్దఎత్తున నీరు చేరుతోందని తెలిపింది. ఈ తాత్కాలిక అడ్డంకి రానున్న మూడు రోజుల్లో ఎప్పుడైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని



హెచ్చరించింది. నేపాల్–టిబెట్ సరిహద్దులో రెండు నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో ఈ ప్రాంతం ఉంది. దీంతో భోటే కోశీ, త్రిశూలి నదీ తీరాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేపాల్ ప్రభుత్వం సూచించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు సురక్షిత ప్రాంతాలను వీడొద్దని హెచ్చరించింది.

### అరగంటలోనే 9 మీటర్ల ఉధృతి

త్రిశూలి నదిలో వరద నీరు కేవలం 30 నిమిషాల్లోనే 9 మీటర్ల మేర పెరిగినట్లు అధికారులు తెలిపారు. మలేఖు ప్రాంతంలోనూ ఏడు మీటర్ల మేర నీటిమట్టం పెరిగింది. భారీ వర్షాలు లేకపోయినా అకస్మాత్తుగా నీటి ఉధృతి పెరగడంతో పలు గ్రామాలు, పట్టణ ప్రాంతాలు జలమయమయ్యాయి. "ఉదయం 8.40 గంటలకు ఇంట్లో టిఫిన్ చేస్తున్నాను. ఒక్కసారిగా తైమూర్ పట్టణం కొట్టుకుపోయిందని ప్రజలు కేకలు వేస్తూ పరుగులు తీశారు. బయటకు వచ్చి చూసేసరికి పెద్ద భూకంపం వచ్చినట్లు అనిపించింది. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే మార్కెట్, ఇళ్లు కళ్లముందే నీటి ఉధృతికి కొట్టుకుపోయాయి" అని ఓ ప్రత్యక్ష సాక్షి కన్నీటితో వివరించారు.

## నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన

# 29మంది గల్లంతు

వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్–టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగధి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80–100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

## ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేదే అధికారం.. కానీ తగ్గిన సీట్లు: మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే

దేశంలో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తే, అధికార ఎన్డీయే కూటమి మరోసారి స్పష్టమైన మెజారిటీతో విజయం సాధిస్తుందని 'ఇండియా టుడే–సి ఓటర్' నిర్వహించిన 'మూడ్ ఆఫ్ ది నేషన్' సర్వే వెల్లడించింది. అయితే, గత సర్వేతో పోలిస్తే ఎన్డీయే బలం స్వల్పంగా తగ్గగా, 'ఇండియా' కూటమి కొంత పుంజుకున్నట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. ఈ సర్వే ప్రకారం, ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయే కూటమి 45 శాతం ఓట్ షేర్‌తో 326 స్థానాలను కైవసం చేసుకుంటుంది. ఇందులో బీజేపీ సొంతంగా 261 సీట్లు సాధిస్తుందని, మిత్రపక్షాలు 65 సీట్లు గెలుచుకుంటాయని అంచనా. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సర్వేలో ఎన్డీయేకు 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా, తాజా సర్వేలో ఆ సంఖ్య 26 మేర తగ్గడం గమనార్హం. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి 185 సీట్లు సాధిస్తుందని సర్వే పేర్కొంది. జనవరి సర్వేతో పోలిస్తే ఇది 3 సీట్లు ఎక్కువ. అయితే, 2024 సాధారణ ఎన్నికల్లో గెలుచుకున్న 234 స్థానాలతో పోలిస్తే ఇది 49 సీట్లు తక్కువ. ఓట్ షేర్ పరంగా ఎన్డీయేకు 45.1 శాతం, 'ఇండియా' కూటమికి 39.1 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. తదుపరి ప్రధానిగా ఎవరు ఉండాలనే ప్రశ్నకు 49 శాతం మంది నరేంద్ర మోదీకి మద్దతు పలికారు. రాహుల్ గాంధీకి 27 శాతం మంది మొగ్గు చూపారు. ఇక అనూహ్యంగా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ పార్టీ 9 శాతం మద్దతుతో మూడో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఆ పార్టీకి పార్లమెంటులో ఒక్క ఎంపీ కూడా లేకపోవడం గమనార్హం. రాహుల్ గాంధీ చేపట్టిన ప్రజా ఉద్యమాల ప్రభావంతో కాంగ్రెస్ సీట్ల సంఖ్య 80 నుంచి 106కు పెరిగిందని సర్వే విశ్లేషించింది. అదే సమయంలో పరీక్షల పేపర్ లీకులు, ఇతర పరిపాలనాపరమైన అవకతవకల కారణంగా బీజేపీ గెలిచే సీట్ల సంఖ్య గత ఆరు నెలల్లో 287 నుంచి 261కి తగ్గినట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేను జులై 1 నుంచి ఆగస్టు 25 మధ్య కాలంలో మొత్తం 25,184 మంది అభిప్రాయాల ఆధారంగా నిర్వహించారు.

## సోదరుడు కేటీఆర్‌పై మాజీ ఎంపీ కవిత తీవ్ర అసంతృప్తి

బీఆర్ఎస్‌లో అంతర్గత సంక్షోభం వల్లే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శ
హరీశ్ రావు బీజేపీ మద్దతుతో పార్టీని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని ఆరోపణ

రేపు రాఖీ పండుగ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడికి రాఖీ కట్టే అవకాశం మరోసారి దక్కకపోవడంపై ఆమె తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడబిడ్డగా తన ఆత్మగౌరవం దెబ్బతిన్నదని వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాఖీ పండుగ ప్రస్తావన రాగా కవిత భావోద్వేగానికి గురయ్యారు. "ఈసారి కేటీఆర్‌కు రాఖీ కడతారా?" అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ, "పోయినసారి అడిగితే ఆయన ఊర్లో లేకుండా పారిపోయారు. ఈసారి అడగకుండానే ఏకంగా విదేశాలకు వెళ్లిపోయారు. ఆడబిడ్డలమైన మాకు కూడా ఆత్మగౌరవం ఉంటుంది కదా? మా ఆత్మగౌరవం చాలా తీవ్రంగా దెబ్బతింది" అని ఆవేదనతో అన్నారు. రాఖీ అంటే రక్త సంబంధమని, దాన్ని రాజకీయాలతో ముడిపెట్టకూడదని ఆమె హితవు పలికారు. రాఖీ విషయంలో తన అసంతృప్తిని వెళ్లగక్కడంతోనే కవిత ఆగలేదు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు, బీజేపీ–ఆర్ఎస్ఎస్ మద్దతుతో బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం మెదక్‌లో రహస్య సమావేశాలు కూడా నిర్వహించారని అన్నారు. "నా సోదరుడు కేటీఆర్ చాలా అమాయకుడు, అందుకే నన్ను ఒక పథకం ప్రకారం పార్టీ నుంచి బయటకు పంపించారు" అని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్‌లో ప్రస్తుతం తీవ్ర అంతర్గత సంక్షోభం నడుస్తోందని, అందుకే ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. పార్టీలో నెలకొన్న ఈ సంక్షోభం కారణంగానే ప్రజల పక్షాన నిలబడటంలో విఫలమవుతున్నారని అన్నారు. ప్రజలు ఈ విషయాలను గమనించి, తమలాంటి వారిని ఆశీర్వదించాలని కోరారు.

## షాద్‌నగర్‌లో కన్నీటి దృశ్యం.. సోదరుడికి కడసారి రాఖీ



తెలంగాణలోని షాద్‌నగర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాఖీ పండుగ సమీపిస్తున్న వేళ, ఓ సోదరుడు విద్యుదాఘాతంతో మరణించగా, అతని సోదరి నిర్జీవంగా పడి ఉన్న తమ్ముడికి కన్నీటితో రాఖీ కట్టింది. ఈ హృదయ విదారక దృశ్యం అక్కడున్న కుటుంబ సభ్యులు, బంధువులను శోకసంద్రంలో ముంచెత్తింది. వివరాల్లోకి వెళితే.. షాద్‌నగర్‌లోని నెహ్రూ నగర్ కాలనీకి చెందిన జమల్లాపూర్ నవీన్ (24) బుధవారం విద్యుదాఘాతంతో మరణించాడు. చాతనపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఒక దుకాణంలో ఎలక్ట్రికల్ వైర్‌కు మరమ్మతులు చేస్తుండగా, అతను ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలను తాకడంతో ఈ దుర్ఘటన జరిగింది. రెండు రోజుల్లో రాఖీ పండుగ ఉండటంతో సోదరుడి ఆకస్మిక మరణం అతని సోదరి పూజితను తీవ్రంగా కలచివేసింది. తమ మధ్య ఉన్న అన్నాచెల్లెళ్ల బంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆమె తన సోదరుడి మృతదేహానికి చివరిసారిగా రాఖీ కట్టి కన్నీటి వీడ్కోలు పలికింది. ఈ ఘటనతో నవీన్ కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. కళ్ల ముందే కొడుకు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

## ఓటర్ల జాబితా సవరణ ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులపై ఎందుకీ ఉక్కుపాదం?

పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. తమ భవిష్యత్తును కాపాడాలని విద్యార్థులు ఆందోళన చేస్తుంటే వారిపై కేసులు పెట్టడం, భౌతిక దాడులకు పాల్పడటం సరికాదన్నారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థులు మూడేళ్లకు రూ.15 వేలలోపే ఫీజుతో చదువుతున్నారని, భవిష్యత్తులో ఫీజులు పెరిగితే పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఏపీలో పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఢిల్లీలోనూ ఇలాంటి విధానం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని పేర్కొన్నారు. అక్కడ విఫలమైన విధానాన్ని తెలంగాణలో ఎందుకు అమలు చేస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏపీ, ఢిల్లీ తరహాలో జీవో 97ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టులు, కేసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. జీవో 97ను రద్దు చేయకపోతే విద్యార్థులు, యువత మరింత పెద్ద ఎత్తున ఉద్యమించే పరిస్థితి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు తమ సమస్యలపై ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణకు వచ్చి వారి సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. "ఢిల్లీకో నీతి.. తెలంగాణకో నీతా?" అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇదే సమయంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద టీఎన్జీఓలు చేపట్టిన ధర్నాకు హరీశ్‌రావు మద్దతు తెలిపారు. ధర్నా శిబిరానికి చేరుకుని ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు దగ్గరపడుతున్నా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు కాలేదని, వేతన సవరణ సంఘం అంశంలోనూ పురోగతి లేదని విమర్శించారు. దేశంలో ఆరు విడతల కరువు భత్యాలు పెండింగ్‌లో పెట్టిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనని హరీశ్‌రావు ఆరోపించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. "రేవంత్‌రెడ్డి.. మీరు ప్రభుత్వం నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా?" అని ప్రశ్నించారు. ప్రతిపక్షం ప్రశ్నించే హక్కును కూడా కాలరాస్తున్నారని, ఇలాంటి చర్యలకు ఏదో ఒక రోజు ప్రజల నుంచి తగిన సమాధానం ఎదురవుతుందని హెచ్చరించారు. హరీశ్‌రావు పర్యటన ముందుగానే పోలీసులకు సమాచారం అందడంతో ఆయనను మార్గమధ్యంలోనే అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి నాయకులను పలుచోట్ల అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టీఎన్జీఓల ధర్నాలో పాల్గొన్న హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులను కలెక్టరేట్ వద్ద అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకుల అరెస్టుతో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని బైఠాయించి ఆందోళన చేపట్టారు.

# మీర్ ఆలమ్ చెరువుపై నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మీర్ ఆలమ్ చెరువు మధ్యలో ఉన్న ఐ ల్యాండ్ లను అభివృద్ధి చేయాలని అధికారులకు ఆదేశాలు**

**చెరువు లో మురుగు నీరు కలవకుండ చర్యలు తీసుకోవాలి**

**చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ వరకు రోడ్డు ను విస్తరించాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**









రాజేంద్రనగర్, ప్రజాజ్వాల : హైదరాబాద్ మహానగరంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న చింతల్ మెట్ మీర్ ఆలమ్ పార్కు నుంచి మీర్ ఆలమ్ చెరువు మీదుగా శాస్త్రిపురం చౌరస్తా వరకు రూ.430 కోట్లతో నిర్మిస్తున్న ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం పనులను గురువారం ఉదయం 8:30 గంటలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ ఐకానిక్ బ్రిడ్జి పనులను మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్) ఆధ్వర్యంలో నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి తో పాటు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి, ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ఇ వి నరసింహ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి లు ఉన్నారు. మీర్ ఆలమ్ చెరువు మధ్యలో నుంచి 58 పిల్లర్ లతో ఐకానిక్ బ్రిడ్జి ని నిర్మిస్తుండగా ఇప్పటికే 33 పిల్లర్ లకు ఫౌండేషన్ పనులు ప్రారంభమయ్యాయి. నాలుగు నెలలుగా ఐకానిక్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. ఒక గంట పదిహేను నిమిషాల పాటు మీర్ ఆలమ్ చెరువు వద్ద ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం గురించి అధికారులు వివరించారు. బ్రిడ్జి నిర్మాణం గురించి ఎం ఆర్ ఎఫ్ డీ సీ ఎల్ ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. బ్రిడ్జి నిర్మాణం గురించి అధికారులు ఇ వి నరసింహ రెడ్డి, గౌతమి లు ముఖ్యమంత్రి కి కూలంకుషంగా వివరించారు.

**మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

మీర్ ఆలమ్ చెరువు మీదుగా ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేస్తున్న నేపద్యం లో ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. చెరువు లోకి మురుగు నీరు చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు, గుర్రపు డెక్క పెరగ కుండ చూడటం తో పాటు ఎప్పటి కప్పుడు తొలగించాలన్నారు. మూసి లో ఉన్న ఐ ల్యాండ్ లను అభివృద్ధి చేసి గార్డెనింగ్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అక్కడ థీమ్ పార్కులను అభివృద్ధి చేయాలన్నారు.

**చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ రోడ్డు ను విస్తరించాలి**

చింతల్ మెట్ నుంచి కిషన్ బాగ్ వరకు ఉన్న రహదారి ని విస్తరించాలని రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ గా కూడా ఉన్న సోలిపేట శ్రీనివాస్ రెడ్డి ని ముఖ్యమంత్రి ఆదేశించారు. శంషాబాద్ లో గల రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం కు సమీపంలో ఉన్న మీర్ ఆలమ్ చెరువు ను పర్యాటక ప్రాంతం గా అభివృద్ధి చేస్తే ఇక్కడికి దేశ విదేశాల నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అనుకున్న గడువు లోగా మీర్ ఆలమ్ చెరువు పై ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఫైర్ డిపార్ట్ మెంట్ కు చెందిన భారీ క్రేన్ పై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డి మీర్ ఆలమ్ చెరువు ను, చెరువు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంట ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్య రాజ్ తదితరులు ఉన్నారు.





## ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఫేస్- 2 కార్యశాల విజయవంతం : ఎస్.వెంకటేష్

రాజేంద్రనగర్, ప్రజాజ్వాల : రాజేంద్రనగర్ నియోజకవర్గపు ఇన్చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్ ) – 2వ దశ అవగాహన సదస్సు విజయవంతం అయిందని కాటేదాన్ బీఆర్ ఎస్ అధ్యక్షులు వెంకటేష్ అన్నారు. గురువారం రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబులరెడ్డి నగర్ లో పార్టీ ప్రతినిధులతో అధికారులతో వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాటేదాన్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్. వెంకటేష్ హాజరై మాట్లాడుతూ.. రానున్న 24 రోజులు అధికారులు జారీ చేసే నోటీసులను అందుకున్న ప్రతి ఓటరు వీలైనంత త్వరగా నోటీసులకు అనువైన పత్రాలను జతపరిచి తమ ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్త పడాల్సిందిగా కొరుతు ఓటర్ జాబితాలను బిఎల్ఏ లు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఓటు హక్కు లేని అర్హులైన వారిని గుర్తించి కొత్తగా ఓటరుగా నమోదు చేయించాలని, అనుమానాస్పద ఓటర్లు ఉన్నట్లయితే వారికి ఫారం–7 ద్వారా అభ్యంతరాలు నమోదు చేయాలని సూచించారు. బిఎల్ఏలు, బిఎల్ఓలతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్ల జాబితాలను పరిశీలించి, అనుమానాస్పద ఓటర్లను గుర్తించడంతో పాటు, ఎప్పటికప్పుడు జాబితాను పరిశీలిస్తూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి రాఘవరెడ్డి, విజయేందర్, వీడం రమేష్, ప్రకాష్, నాగమణి, మాధవి, అనిత, కనకవ్వ, సుజాత, హేమలత, భానుప్రియ, సంధ్య, నాగమణి, మాధవి, గీత తోపాటు బిఆర్ఎస్ బిఎల్ఏలుగా ఉప్పల్ శ్రీనివాస్, అశోక్ కుమార్, కిష్టప్ప, రామకృష్ణ, పుష్ప, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో ఆరోగ్యకరమైన, క్రమశిక్షణతో కూడిన సమాజ నిర్మాణం

**యువత క్రీడా రంగంలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి**

**మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ‘ఖేలో ఇండియా సంవాద్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాత్’ కార్యక్రమం**





రాజేంద్రనగర్, ప్రజాజ్వాల : జాతీయ క్రీడా దినోత్సవం--2026 సందర్భంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖకు చెందిన మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ‘ఖేలో ఇండియా సంవాద్ -- ఖేల్ కీ బాత్ పీఎం కే సాత్’ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లాలోని సింబయాసిస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (ఎస్ ఐ బి ఎం) లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మహబూబ్‌నగర్ పార్లమెంటరీ నియోజకవర్గ గౌరవ ఎంపీ డీకే అరుణ, ఒలింపిక్ పతక విజేత, ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ముస్కాన్ ఖాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. దేశవ్యాప్తంగా మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ‘ఫిట్ ఇండియా’, క్రమశిక్షణతో కూడిన క్రీడా దేశ నిర్మాణం, యువత ఆకాంక్షలను దేశ అభివృద్ధి ప్రయాణంలో కేంద్రంగా నిలపాలనే దార్శనికతకు అనుగుణంగా కార్యక్రమం కొనసాగింది. ముందుగా యువత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం ఖేలో ఇండియా సంవాద్, యువ సంవాద్ కార్యక్రమాలు నిర్వహించారు. దేశంలో క్రీడా వ్యవస్థలో వస్తున్న మార్పులు, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడా ప్రతిభను వెలికితీయడం, భవిష్యత్ అంతర్జాతీయ క్రీడా పోటీలకు సన్నద్ధత, వికసిత్ భారత్ ఏ2047 లక్ష్య సాధనలో యువత పాత్ర తదితర అంశాలపై యువతతో చర్చలు జరిగాయి.

**క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదలను పెంపొందిస్తాయి: పీవీ సింధు**

ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు యువతతో ముచ్చటిస్తూ తన క్రీడా ప్రయాణంలోని అనుభవాలను పంచుకున్నారు. క్రీడలను జీవితంలో భాగంగా చేసుకోవాలని, ఫిట్‌నెస్, క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో ముందుకు సాగాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా వ్యక్తిగతంగా, జాతీయ స్థాయిలో మంచి ఫలితాలను సాధించవచ్చని యువతకు స్ఫూర్తినిచ్చారు.

**క్రీడా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎంపీ డీకే అరుణ**

దేశ నిర్మాణంలో యువత, క్రీడల పాత్ర ఎంతో కీలకమని ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. క్రీడా రంగంలో కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న విస్తృత అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన, చురుకైన జీవన విధానాన్ని అలవర్చుకుని ఫిట్ ఇండియా -- వికసిత్ భారత్ లక్ష్య సాధనలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**మై భారత్ పోర్టల్‌లో యువత నమోదు చేసుకోవాలి..**

మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ స్నేహల్ జ్ఞానేశ్వర్ బసుత్కర్ మాట్లాడుతూ.. యువత మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వచ్ఛంద సేవ, అనుభవాత్మక అభ్యాసం, నాయకత్వం, దేశ నిర్మాణానికి సంబంధించిన వివిధ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బ్యాడ్మింటన్ క్రీడాకారిణి ముస్కాన్ ఖాన్ కూడా యువతతో ముచ్చటించి, క్రీడా రంగంలో తమ లక్ష్యాలను సాధించేందుకు అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు.

**‘నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్’ ప్రతిజ్ఞ**

కార్యక్రమంలో ముఖ్యమైన భాగంగా ‘నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్’ ప్రతిజ్ఞను పాల్గొన్న యువతతో చేయించారు. ఆరోగ్యకరమైన, మాదకద్రవ్య రహిత జీవన విధానాన్ని ప్రోత్సహిస్తూ, మాదకద్రవ్య రహిత క్యాంపస్‌లు, సమాజాలు, దేశ నిర్మాణానికి కృషి చేస్తామని యువత ప్రతిజ్ఞ చేశారు. క్రీడలు, ఫిట్‌నెస్, సానుకూలమైన యువత భాగస్వామ్యం ద్వారా మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చనే సందేశాన్ని ఈ కార్యక్రమం అందించింది. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు బృందాలు సమన్వయంతో కృషి చేశాయి. కార్యక్రమం విజయవంతమైన నిర్వహణలో డి. శ్రీశైలం, డి. గ్రీష్మ, పి. కృతీ కీలకంగా పనిచేశారు. యువ సంవాద్ సందర్భంగా యువత తమ ఆలోచనలు, ఆశయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా క్రీడాస్ఫూర్తి, యువ నాయకత్వం, నషా ముక్త్ భారత్, ఫిట్ ఇండియా, వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యాల పట్ల యువతలో మరింత అవగాహన, ఉత్సాహం పెంపొందింది.



## మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుండా, ఉన్న వేతనాలు తగ్గించటం సిగ్గుచేటు..

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ఆగ్రహం**

రాజేంద్రనగర్, ప్రజాజ్వాల : రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు వేతనాలు పెంచకుండా, ఉన్న వేతనాలు తగ్గించటం సిగ్గుచేటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు పెంచుతున్నామని ప్రకటించి, అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. హైదరాబాద్, ఇందిరా పార్క్, ధర్నా చౌక్ లో మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) ఆధ్వర్యంలో మహా ధర్నా జరిగింది. ఈ ధర్నాకు యూనియన్ అధ్యక్షులు కె. ఏసురత్నం అధ్యక్షత వహించగా కూనంనేని సాంబశివ రావు ముఖ్యఅతిథిగా, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాలరాజ్, కార్యదర్శి బి. వెంకటేశం ప్రత్యేక అతిథులతోపాటు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి. జైపాల్ రెడ్డి, ఆఫీస్ బేరర్స్ పి.వెంకటయ్య, బొడ్డుపల్లి కిషన్, కమతం యాదగిరి, ఎండి ఉస్మాన్, ఎం.మద్దిలేటి, కమలమ్మ పాల్గొన్నారు. ఈ సందర్బంగా కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ... జి.హెచ్.ఏం.సి ను మూడు కార్పొరేషన్‌లుగా విభజించి, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ కార్పొరేషన్‌లలో మున్సిపల్ వేతనాలు ఇవ్వడం అన్యాయమన్నారు. 2వ పీఆర్సీని అమలు చేయడంతోపాటు జి.హెచ్.ఏం.సి లో చెల్లించే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. దేశంలో రాష్ట్రంలోని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మనంట్ చేసి కనీస వేతనాలు నెలకు రూ.26వేలు అమలు చేయాలనీ డిమాండ్ చేసారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కరానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రంలోని కార్మిక సంఘాలు ఏకమై బలమైన పోరాటాలు నిర్వహించాలని కూనంనేని సాంబశివ రావు పిలుపునిచ్చారు.

ఎస్. బాలరాజ్ మాట్లాడుతూ... బడుగు బలహీన వర్గాలకు చెందిన మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కనీస వేతనాలు, ఉద్యోగ భద్రతతోపాటు ప్రభుత్వ పథకాలు ఇందిరమ్మ ఇండ్లు, విడో పెన్షన్, వృద్ధాప్య పెన్షన్ లాంటి పథకాలను వర్తింపచేయాలని కోరారు.

వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్స్, వర్క్ ఇన్‌స్పెక్టర్స్, డ్రైవర్స్, వాటర్ సప్లయ్, శానిటరీ జవాన్, ఇన్‌స్పెక్టర్స్, ఎన్.ఏం.ఆర్ కార్మికులకు వేతనాలు తగ్గించి ఇస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించి వారికీ యధావిధిగా పాత పద్ధతిగానే వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీన వైఖరి అవలంబిస్తే, ఉరుకునేదిలేదని , సమ్మెలోకి వెలుతామని హెచ్చరించారు. కె. రత్నం మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు విధి నిర్వాహణలో, అనారోగ్యంతో మరణించినా మరియు 60 సంవత్సరాలు నిండిన పైబడిన కార్మికుల కుటుంబంలో ఒకరికి మానవతా దృక్పథంతో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ ధర్నాలో యూనియన్ నేతలు ఆర్.శ్రీనివాస్, అజయ్, సతీష్, టి.ఆనంద్, కౌసర్ బాయ్, మహేందర్, తిరుపతి, బి.శ్రీనివాస్,అశోక్, నరసింహులు, యాదగిరి, రామ్ చందర్, కిరణ్, ప్రభాకర్, రమేష్, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండానే భారీ భవన నిర్మాణం!

### ఇంద్రన్న కాలనీలో జీహెచ్ఎంసీ నిబంధనలకు తూట్లు

### సర్వే నంబర్ 191లో 300 గజాల్లో నిర్మాణం.. పట్టించుకోని అధికారులు?

### కనకదుర్గ ఆలయం ఎదురుగా కొనసాగుతున్న పనులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్





నిజాంపేట్, ఆగస్టు 27 (ప్రజాజ్వాల): నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ఇంద్రన్న కాలనీలో అనుమతులు లేకుండానే భారీ భవన నిర్మాణం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సర్వే నంబర్ 191లోని సుమారు 300 గజాల స్థలంలో, కనకదుర్గ ఆలయం ఎదురుగా నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీహెచ్ఎంసీ నుంచి అవసరమైన భవన నిర్మాణ అనుమతులు పొందకుండానే నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మాణ స్థలాన్ని సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, భవనానికి అనుమతులు ఉన్నాయా? అనుమతులు ఉన్నట్లయితే వాటికి అనుగుణంగానే నిర్మాణం జరుగుతోందా? అనే అంశాలను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులను నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నిజాంపేట్ పరిధిలో అనధికార నిర్మాణాలపై గతంలోనూ ఆరోపణలు, ఫిర్యాదులు వెలువడిన నేపథ్యంలో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నదనే ఆరోపణలపై అధికారులు అధికారికంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలని, అక్రమం ఉన్నట్లయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# 26 ఏళ్లుగా సేవలు.. ఇంకా అన్యాయమేనా?

### 411 మంది ఒకేషనల్ అధ్యాపకులకు న్యాయం చేయాలి

### అర్హుల పోస్టులను నాన్-శాంక్షన్‌గా చూపడంపై ఆవేదన

### సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని సమస్య పరిష్కరించాలి

### ఒకేషనల్ అధ్యాపకులకు న్యాయం చేయాలి

### సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలి

### క్వాలిఫైడ్ ఒకేషనల్ జూనియర్ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రవిశంకర్



హైదరాబాద్, ఆగస్టు 27 (ప్రజాజ్వాల): గత 26 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తూ నిరుపేద విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్న ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులకు న్యాయం చేయాలని క్వాలిఫైడ్ ఒకేషనల్ జూనియర్ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల రవిశంకర్ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని, ఇంటర్ విద్యా అధికారులను కోరారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఒప్పంద అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియలో జరిగిన లోపాల కారణంగా అర్హత కలిగిన సుమారు 411 మంది ఒకేషనల్ అధ్యాపకులకు అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అప్పట్లో అధ్యాపకుల విద్యార్హతలు, సర్టిఫికెట్లు, ఇతర ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి క్రమబద్ధీకరణ చేపట్టి ఉంటే అర్హులైన వారందరికీ న్యాయం జరిగేదన్నారు. క్రమబద్ధీకరణ పొందిన కొందరు అధ్యాపకులు సమర్పించిన ధ్రువపత్రాలపై అనుమానాలు వ్యక్తమై, 37 మందికి నోటీసులు జారీ చేయడం సరైన చర్యేనని పేర్కొన్నారు. అయితే ముందుగానే అన్ని ధ్రువపత్రాలను సమగ్రంగా పరిశీలించి ఉంటే అనర్హులకు పోస్టులు దక్కకుండా, అర్హత కలిగిన మరో 400 మందికి పైగా ఒకేషనల్ అధ్యాపకులకు అవకాశం లభించేదని రవిశంకర్ అన్నారు. ప్రస్తుతం విడుదలైన రెన్యూవల్ ఉత్తర్వుల్లో గెస్ట్ అధ్యాపకుల పోస్టులకు మంజూరైన పోస్టులుగా చూపించి, దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకుల పోస్టులను నాన్-శాంక్షన్ పోస్టులుగా చూపించడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది తమ పట్ల వివక్షకు నిదర్శనమని ఆరోపించారు. వెంటనే పోస్టుల వివరాలను సరిచేసి, 26 ఏళ్లుగా సేవలందిస్తున్న ఒకేషనల్ ఒప్పంద అధ్యాపకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 2000 సంవత్సరం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చాలీచాలని వేతనాలతో, వేతనాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితుల్లోనూ విధులు నిర్వహిస్తూ, పేద విద్యార్థులకు వృత్తి విద్యను అందించి వారు త్వరగా ఉపాధి పొందేలా కృషి చేస్తున్నామని రవిశంకర్ తెలిపారు. ఈ అంశంపై గురువారం స్పందించిన కమిషనర్ అభిలాష అభినవ్, విషయాన్ని పరిశీలించాలని ఏడి ప్రసన్నలతకు ఆదేశించినట్లు రవిశంకర్ తెలిపారు. క్రమబద్ధీకరణ పొందిన అధ్యాపకుల విద్యార్హతలు, ధ్రువపత్రాలపై సమగ్ర విచారణ చేపట్టి, అనర్హులు ఉంటే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో అర్హతలు కలిగి ఇప్పటికీ క్రమబద్ధీకరణకు నోచుకోని ఒకేషనల్ అధ్యాపకుల సర్టిఫికెట్లను పరిశీలించి, వారికి పోస్టులు మంజూరు చేసి న్యాయం చేయాలని ప్రభుత్వ పెద్దలకు, ఇంటర్ విద్యా అధికారులకు క్వాలిఫైడ్ ఒకేషనల్ కాంట్రాక్ట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది.

# మహాదేవపురం అభివృద్ధికి రూ.1.20 కోట్ల నిధులు

### నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం

### కైసర్‌నగర్‌లో శివాలయం రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో పనులు

### ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: కొలన్ హన్మంత్‌రెడ్డి




కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 (ప్రజాజ్వాల): మహాదేవపురం డివిజన్ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 277వ డివిజన్ పరిధిలోని కైసర్‌నగర్‌లో సీఎంసీ ప్రత్యేక నిధుల ద్వారా మంజూరైన రూ.1 కోటి 20 లక్షలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కైసర్‌నగర్‌లోని శివాలయం రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన రహదారుల నిర్మాణం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రతి కాలనీ అభివృద్ధికి సముచిత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మహాదేవపురం కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయించిన కొలన్ హన్మంత్‌రెడ్డికి కాలనీ వాసులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా వైస్ ప్రెసిడెంట్ అంజలి యాదవ్, మేడ్చల్-మల్కాజ్‌గిరి ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, మైనారిటీ నాయకులు షఫీ, సుల్తాన్ మీర్జా, దేవేందర్‌నగర్ అధ్యక్షుడు అపజల్ భాయ్, వాలి భాయ్, ఫారూఖ్ ఖాన్, అజీమ్ భాయ్, మునావర్ భాయ్, ఘూఫర్, ఇమ్రాన్, అసిఫ్, మహేందర్, గంగాధర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 (ప్రజాజ్వాల): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు కూన శ్రీశైలం గౌడ్ మహాదేవపురం డివిజన్‌కు చెందిన దొంపబోయిన శ్రీనివాస్ కుమార్తె వివాహ వేడుకకు హాజరయ్యారు. కేవీఎస్‌లో జరిగిన వివాహ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన దంపతులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వివాహ వేడుకలో పాల్గొన్న బంధుమిత్రులతో ఆత్మీయంగా మాట్లాడారు.



## నేపాల్ వరదలు: తెలంగాణ వాసుల కోసం ఢిల్లీలో హెల్ప్‌లైన్!

### నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసులకు అండ

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో ఢిల్లీలో ప్రత్యేక కేంద్రం

### విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయంతో సమన్వయం

### సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్ల విడుదల

నేపాల్‌ను భారీ వరదలు ముంచెత్తుతున్న నేపథ్యంలో, అక్కడ చిక్కుకున్న తెలంగాణ వాసులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్, కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందించనున్నారు. ఈ కేంద్రం ద్వారా కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం, ఇతర ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రభుత్వం నిశితంగా గమనిస్తోందని, బాధితుల విజ్ఞప్తులపై తక్షణమే స్పందిస్తామని అధికారులు తెలిపారు. నేపాల్‌లో ఉన్న తమ కుటుంబ సభ్యులు, యాత్రికులు, పర్యాటకులతో సంబంధాలు తెగిపోయిన వారు ఈ హెల్ప్‌లైన్ కేంద్రాలను సంప్రదించాలని ప్రభుత్వం సూచించింది. సహాయం కోరే వారు బాధితుల పేరు, పాస్‌పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో వారు చివరిగా ఉన్న ప్రదేశం, టూర్ ఆపరేటర్ వివరాలు, కుటుంబ సభ్యుల సంప్రదింపు సమాచారాన్ని అందించాలని అధికారులు కోరారు. హెల్ప్‌లైన్ నంబర్లు: సహాయం అవసరమైన వారు రెసిడెంట్ కమిషనర్ పీ.ఎస్. వందన (9871999044), పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సి.హెచ్. చక్రవర్తి (9949351270), లైజన్ ఆఫీసర్ జి. రక్షిత్ నాయక్ (9618597969) నంబర్లలో సంప్రదించాలని ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.



## ఏపీ, తెలంగాణ మధ్య ఉద్రిక్తత: సాగర్ గేట్లు ఎత్తేందుకు ఏపీ యత్నం.. అడ్డుకున్న తెలంగాణ అధికారులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య మరోసారి జల వివాదం రాజుకుంది. సాగర్ కుడికాల్వ గేట్లు ఎత్తి నీటిని తీసుకునేందుకు ఏపీ అధికారులు చేసిన ప్రయత్నాన్ని తెలంగాణ ఇంజనీర్లు అడ్డుకున్నారు. కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకుండానే గేట్లు ఎలా తెరుస్తారంటూ అడ్డుకోవడంతో ఇరు రాష్ట్రాల మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. బుధవారం ఉదయం 11:10 గంటల సమయంలో ఏపీ జలవనరుల శాఖ అధికారులు నాగార్జునసాగర్ కుడికాల్వ గేట్లను ఎత్తేందుకు ప్రయత్నించారు. తమ రాష్ట్ర తాగునీటి అవసరాల కోసమే నీటిని విడుదల చేసుకుంటున్నామని వారు వాదించారు. అయితే, కృష్ణా బోర్డు అనుమతి లేకుండా గేట్లు తెరవడానికి వీల్లేదని తెలంగాణ ఇంజనీర్లు స్పష్టం చేయడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. గేట్లు ఎత్తడం సాధ్యం కాకపోవడంతో ఏపీ ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంచుకుంది. ప్రస్తుతం సాగర్‌లో 535 అడుగుల నీటిమట్టం ఉండటంతో, కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని ప్రారంభించి దాని ద్వారా 2,000 క్యూసెక్కుల నీటిని తమ కాల్వకు విడుదల చేసింది. దీనికి ప్రతిగా తెలంగాణ కూడా వెంటనే స్పందించి, సాగర్ ఎడమ కాల్వ గేట్లు ఎత్తి 2,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసింది. వాస్తవానికి, ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై ఇటీవలి బోర్డు సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో నీటి విడుదలపై బోర్డు ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. ఈ నేపథ్యంలో ఏపీ ఏకపక్షంగా నీటిని తీసుకోవడంపై తెలంగాణ అధికారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై గురువారం కృష్ణా బోర్డుకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. గతంలో 2023 నవంబర్‌లో కూడా ఇదే తరహా వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం గమనార్హం.

# శ్రీరస్తు.. శుభమస్తు అంటూ నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం రేవంత్

### షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ మేనకోడలు రాణి-శివకుమార్ వివాహ వేడుకకు ముఖ్యమంత్రి ప్రత్యేక హాజరు





షాద్‌నగర్, ఆగస్టు 27 (ప్రజాజ్వాల): షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్--అనురాధ దంపతుల మేనకోడలు రాణి--శివకుమార్‌ల వివాహ వేడుక శంషాబాద్‌లోని మల్లికా గార్డెన్స్/మల్లిక కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. కుటుంబ సభ్యులు, రాజకీయ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు, జర్నలిస్టులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక హాజరు**

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేకంగా ఆహ్వానించడంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి వివాహ వేడుకకు హాజరయ్యారు. నూతన వధూవరులు రాణి--శివకుమార్లను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. సీఎం రేవంత్‌రెడ్డి రాక సందర్భంగా షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభిమానులు ఉత్సాహంగా ఆయనను కలుసుకున్నారు. సీఎం వారందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ కరచాలనం చేశారు.

**ప్రముఖుల సందడి**

వివాహ వేడుకకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరై రాణి--శివకుమార్ నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి కూడా వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**నూతన దంపతులను ఆశీర్వదించిన బండ్ల గణేష్**

ప్రముఖ సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ వివాహ వేడుకకు హాజరై రాణి-శివకుమార్‌లను ఆశీర్వదించారు. నూతన దంపతులతో ఆత్మీయంగా ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు.

**తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి ప్రత్యేక పలకరింపు**

మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి కూడా వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ ప్రముఖులతో ఆయన ఆత్మీయంగా ముచ్చటించారు.

**సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివాహ వేదికకు చేరుకున్న సందర్భంగా కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, దళిత నేత, విద్యార్థి నాయకుడు జంగారి రవి తదితరులు సీఎంను స్వాగతించారు.

**జర్నలిస్టుల ఆశీర్వాదం**

షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్ట్ ఎం.డి. ఖాజాపాషా (కె.పి.), శ్యామల దంపతులతో పాటు స్థానిక జర్నలిస్టులు రాఘవేందర్ గౌడ్, శివకుమార్, సాయినాథ్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్-అనురాధ దంపతులను కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

**సరదా ముచ్చట్లతో సందడి**

వివాహ వేడుకలో సినీ నిర్మాత బండ్ల గణేష్, స్థానిక సీనియర్ నేత చెంది తిరుపతిరెడ్డి, షాద్‌నగర్ సీనియర్ జర్నలిస్ట్ కె.పి. తదితరులు సరదాగా ముచ్చటించుకుంటూ సందడి చేశారు. రాజకీయ, సినీ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖుల రాకతో వివాహ వేదిక సందడిగా మారింది.

**ఆత్మీయతకు వేదికగా వివాహ వేడుక**

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కుటుంబ వివాహ వేడుక రాజకీయ, సామాజిక, సినీ, మీడియా రంగాలకు చెందిన ప్రముఖుల కలయికకు వేదికగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించడం వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖుల ఆశీస్సులతో రాణి--శివకుమార్‌ల దాంపత్య జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో సాగాలని అందరూ ఆకాంక్షించారు.

# మహాదేవపురం అభివృద్ధికి రూ.1.20 కోట్ల నిధులు

### నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం
### కైసర్‌నగర్‌లో శివాలయం రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో పనులు
### ప్రజలకు మెరుగైన మౌలిక వసతులే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: కొలన్ హన్మంత్‌రెడ్డి




కుత్బుల్లాపూర్, ఆగస్టు 27 (ప్రజాజ్వాల): మహాదేవపురం డివిజన్ అభివృద్ధికి మరో ముందడుగు పడింది. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 277వ డివిజన్ పరిధిలోని కైసర్‌నగర్‌లో సీఎంసీ ప్రత్యేక నిధుల ద్వారా మంజూరైన రూ.1 కోటి 20 లక్షలతో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కైసర్‌నగర్‌లోని శివాలయం రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల సమగ్ర అభివృద్ధి, నాణ్యమైన రహదారుల నిర్మాణం, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రతి కాలనీ అభివృద్ధికి సముచిత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మహాదేవపురం కాలనీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.1.20 కోట్ల నిధులు మంజూరు చేయించిన కొలన్ హన్మంత్‌రెడ్డికి కాలనీ వాసులు, వెల్ఫేర్ సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సిద్ధనోళ్ల సంజీవ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా వైస్ ప్రెసిడెంట్ అంజలి యాదవ్, మేడ్చల్-మల్కాజ్‌గిరి ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు, మైనారిటీ నాయకులు షఫీ, సుల్తాన్ మీర్జా, దేవేందర్‌నగర్ అధ్యక్షుడు అపజల్ భాయ్, వాలి భాయ్, ఫారూఖ్ ఖాన్, అజీమ్ భాయ్, మునావర్ భాయ్, ఝాఫర్, ఇమ్రాన్, అసిఫ్, మహేందర్, గంగాధర్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెద్దతండా కేలో ఘనంగా తీజ్ పండుగ ముగింపు వేడుకలు

### సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత
### గిరిజనుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి: లావుడియా మంజుల భాస్కర్ నాయక్
### ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాలతో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



పాలకుర్తి, ఆగస్టు 27(ప్రజాజ్వాల): పాలకుర్తి నియోజకవర్గంలోని పెద్దతండా కే గ్రామంలో గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో, సాంప్రదాయబద్ధంగా నిర్వహించే తొమ్మిది రోజుల తీజ్ పండుగ ముగింపు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తీజ్ పండుగ ముగింపు సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువత, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంప్రదాయ పద్ధతుల్లో వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ వేడుకల్లో పాల్గొని గిరిజనులతో కలిసి పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాలకుర్తి మార్కెట్ చైర్‌పర్సన్ లావుడియా మంజుల భాస్కర్ నాయక్ మాట్లాడుతూ.. తన సొంత గ్రామమైన పెద్దతండా కేలో గిరిజనుల సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహించే తీజ్ పండుగ ముగింపు కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారాలను పరిరక్షించడంతో పాటు వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి నాయకత్వంలో గిరిజనుల సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తుందని ఆమె తెలిపారు. తీజ్ పండుగ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళలు, యువతకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామంలో సోదరభావం, ఐక్యత, సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు గిరాగాని కుమారస్వామి, మార్కెట్ వైస్ చైర్మన్ అనుముల మల్లారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గాదపాక భాస్కర్, సీనియర్ నాయకులు ఆదినారాయణ, పుల్లన్న, గోనె అశోక్‌రెడ్డి, గోనె మహేందర్‌రెడ్డి, పెద్దతండా కే సర్పంచ్ లావుడియా బాలోజీ నాయక్, ఉప సర్పంచ్ బానోతు రవీందర్ నాయక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు గుగులోతు లచ్చిరాం, యూత్ అధ్యక్షుడు హలవతు దాస్రు, లావుడియా శ్రీనునాయక్, లావుడియా గణేష్, ధరావత్ వాసునాయక్, బానోతు రవీందర్ తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ డైరెక్టర్లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై తీజ్ పండుగ ముగింపు వేడుకలను విజయవంతం చేశారు.



## 50 బస్తాల గుట్కా పట్టివేత.. డ్రైవర్ అరెస్ట్

**రూ.7.5 లక్షల విలువైన గుట్కా, డీసీఎం వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం**

**జీఎంఆర్ పార్కింగ్ ప్రాంతంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల పక్కా ఆపరేషన్**

**మహారాష్ట్ర నుంచి గుట్కా తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు**

రాజేంద్రనగర్, ఆగస్టు 27 (ప్రజాజ్వాల): ప్రభుత్వం నిషేధించిన గుట్కాను అక్రమంగా రవాణా చేస్తున్న నిందితుడిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి సుమారు రూ.7.5 లక్షల విలువైన 50 గుట్కా బస్తాలతో పాటు గుట్కా తరలించేందుకు ఉపయోగించిన ఐషర్ డీసీఎం వాహనం, సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 26న రాత్రి సుమారు 8 గంటల సమయంలో మైలార్‌దేవ్‌పల్లిలోని జీఎంఆర్ పార్కింగ్ ప్రాంతంలో నిషేధిత గుట్కా లోడ్‌తో ఓ డీసీఎం వాహనం ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని వీఎ-10-ఋ-4563 నంబర్ గల ఐషర్ డీసీఎం వాహనాన్ని తనిఖీ చేశారు. తనిఖీల్లో వాహనంలో ఒక్కొక్కటి 50 కిలోల బరువున్న మొత్తం 50 గుట్కా బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు మహారాష్ట్రకు చెందిన వాహన డ్రైవర్ అన్వర్ మన్సూర్ సయ్యద్‌ను అదుపులోకి తీసుకున్నారు. గుట్కా బస్తాలతో పాటు డీసీఎం వాహనం, సెల్‌ఫోన్‌ను జప్తు చేసి కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 724/2026, బీఎన్ఎస్ సెక్షన్ 280, సెక్షన్ 20(2) చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ఐపీఎస్, చంద్రాయణగుట్ట ఏసీపీ ఎ. సుధాకర్ పర్యవేక్షణలో మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడి నిర్వహించారు.

## నేపాల్ వరదల ప్రాంతాన్ని సురక్షితంగా దాటాం: డీఆర్డీఓ మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డి

**ప్రస్తుతం నేపాల్ పర్యటనలో ఉన్న సతీశ్ రెడ్డి**

**మానససరోవర్ యాత్ర నిమిత్తం ముందుకు సాగుతున్నామని వెల్లడి**

**పూర్తి సురక్షితంగా ఉన్నామన్న డీఆర్డీఓ మాజీ చైర్మన్**



నేపాల్‌లో సంభవించిన ఘోర ఆకస్మిక వరదలు ప్రపంచాన్ని కుదిపేశాయి. ఈ ఘోర విపత్తుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు అందరినీ కలచివేస్తున్నాయి. మరోవైపు నేపాల్‌లో ఉన్న డీఆర్డీఓ మాజీ చైర్మన్ జి. సతీశ్‌రెడ్డి తమ క్షేమ సమాచారాన్ని వెల్లడించారు. తాము నేపాల్‌లో పూర్తి సురక్షితంగా ఉన్నామని, ప్రస్తుతం మానససరోవర్ యాత్ర నిమిత్తం ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. వరద ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాన్ని తాము సురక్షితంగా దాటుకుని వెళ్లామని చెప్పారు. అయితే మరోవైపు నేపాల్‌ను ముంచెత్తిన ఈ ఆకస్మిక జలప్రళయం తీవ్ర విషాదాన్ని నింపింది. విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించిన అధికారిక వివరాల ప్రకారం వరదల ఉద్ధృతికి ఇప్పటివరకు 826 మంది ఆచూకీ గల్లంతయ్యారు. అంతేకాకుండా, వరద ప్రవాహంలో దాదాపు 300 మంది వరకు భారతీయులు కొట్టుకుపోయినట్లు నేపాల్ విదేశాంగ శాఖ మంత్రి శిశిర్ ఖనాల్ ప్రకటన చేశారు. ఈ దారుణ విపత్తులో మృతుల సంఖ్య ఇప్పటికే 175కి చేరుకోగా, రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలను మరింత వేగవంతం చేశాయి.




## 50వ ఏట అడుగుపెట్టిన ‘రాయలసీమ ఎక్స్‌ప్రెస్’

దక్షిణ మధ్య రైల్వేలో అత్యంత ప్రజాదరణ పొందిన రాయలసీమ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఒక అరుదైన, చారిత్రాత్మక మైలురాయిని చేరుకుంది. 49 ఏళ్ల సుదీర్ఘ సేవలను విజయవంతంగా పూర్తి చేసుకుని, ఈ రైలు ఇప్పుడు 50వ సంవత్సరం (అర్ధ శతాబ్దం)లోకి అడుగుపెట్టింది. 1977లో మీటర్ గేజ్ పట్టాలపై అత్యంత సాధారణ సర్వీసుగా ప్రయాణాన్ని ప్రారంభించిన ఈ రైలు ఐదు పదుల కాలంలో పేద, మధ్యతరగతి ప్రజలకు అత్యంత నమ్మకమైన ‘పేదల బండి’గా నిలిచింది. కాలక్రమేణా ప్రయాణికుల నుంచి వచ్చిన భారీ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైల్వే శాఖ ఈ రైలును హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వరకు పొడిగించింది. అంతేకాకుండా సాధారణ ఎక్స్‌ప్రెస్ నుంచి సూపర్ ఫాస్ట్‌గా అప్‌గ్రేడ్ చేయడమే కాక, ఆధునిక ఎల్హెచ్‌బి కోచ్‌లతో పాటు శక్తివంతమైన ఇంజన్లను అమర్చారు. ప్రస్తుతం ఆధ్యాత్మిక క్షేత్రమైన తిరుపతి నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల మీదుగా 890 కిలోమీటర్ల సుదీర్ఘ దూరాన్ని ప్రతిరోజూ విజయవంతంగా చేరుకుంటోంది. తరాలు మారుతున్నా, ఆధునిక సాంకేతికతతో ఎన్ని వందే భారత్, ఇతర కొత్త రైళ్లు వచ్చినా రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కున్న క్రేజ్, ఆదరణ మాత్రం ఇసుమంతైనా తగ్గలేదు. ముఖ్యంగా వికారాబాద్ జిల్లా తాండూరుతో పాటు పలు ప్రాంతాల ప్రజలతో ఈ రైలుకు విడదీయరాని ప్రత్యేక అనుబంధం ఉంది. మూడు రాష్ట్రాల ప్రజల రవాణా అవసరాలను తీరుస్తూ, ఆత్మీయ బంధాన్ని పెనవేసుకున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ 50వ ఏట ప్రవేశించడంపై రైల్వే ప్రయాణికులు హర్షం వ్యక్తం

# ఈ20 పెట్రోల్‌పై బిగ్ స్టేట్‌మెంట్... అసలు విషయం చెప్పిన బీపీసీఎల్




ఈ20 పెట్రోల్‌పై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న వేళ బీపీసీఎల్ కీలక క్లారిటీ ఇచ్చింది. పాత వాహనాలకు ఈ10 పెట్రోల్‌ను అందుబాటులోకి తీసుకురావాలా? ఈ20తో పాటు ఈ10ను కూడా విక్రయించాలా? అనే అంశాలపై వివరణ ఇచ్చింది. భారత్‌లో పాత వాహనాలు వాడుతున్న వారికి ఈ20తో పాటు తక్కువ ఇథనాల్ కలిగిన పెట్రోల్ అందుబాటులోకి వస్తుందా అనే చర్చ జరుగుతున్న వేళ, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) కీలక విషయం స్పష్టం చేసింది. ఈ20 పెట్రోల్‌ను ఈ10తో భర్తీ చేయాలనే నిర్ణయం ఇప్పటివరకు ఏదీ తీసుకోలేదని సంస్థ తెలిపింది. ప్రస్తుతం చర్చ జరుగుతున్నది పాత వాహనాలకు తక్కువ ఇథనాల్ కలిగిన పెట్రోల్ అందించాలా? అలా చేస్తే దేశవ్యాప్తంగా ఉన్న భారీ ఇంధన పంపిణీ వ్యవస్థ ద్వారా మరో రకం పెట్రోల్‌ను ఎలా సరఫరా చేయాలి? అనే అంశాలపైనే అని చెప్పింది. కంపెనీ వార్షిక షేర్‌హోల్డర్ల సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడిన బీపీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ఖన్నా మాత్రం ప్రభుత్వం ఇథనాల్ కలపడం విషయంలో విధానాన్ని మార్చితే ఈ20 నుంచి ఈ10కు మారడంలో తమకు ఆపరేషనల్ లేదా లాజిస్టిక్స్ పరంగా పెద్ద సమస్య ఏమీ కనిపించడం లేదన్నారు. "ఈ20ని ఈ10గా మార్చుతామని నేను ఎప్పుడూ చెప్పలేదు" అని ఆయన స్పష్టం చేశారు. పాత వాహనాలకు తక్కువ ఇథనాల్ కలిగిన ఇంధనాన్ని ఒక ఆప్షన్‌గా ఇవ్వాలా అనే విషయంపై కొన్ని వర్గాల్లో చర్చ జరుగుతోందని చెప్పారు. "అంటే ఈ20 పూర్తిగా వెళ్లిపోతుంది, ఈ10 వచ్చేస్తుంది అని కాదు" అని ఆయన అన్నారు. పాత వాహనాలకు 10 శాతం ఇథనాల్ ఉన్న ఈ10 పెట్రోల్‌ను, 20 శాతం ఇథనాల్ ఉన్న ఈ20 పెట్రోల్‌తో పాటు అందుబాటులో ఉంచాలా అనే దానిపై ప్రస్తుతం విస్తృతంగా విధాన చర్చ జరుగుతోంది. ముడి చమురు దిగుమతులను తగ్గించడం, కాలుష్య ఉద్గారాలను తగ్గించడం, దేశంలో ఇథనాల్ ఉత్పత్తికి ప్రోత్సాహం ఇవ్వడం కోసం భారత్ పెట్రోల్‌లో ఇథనాల్ కలపడాన్ని క్రమంగా పెంచుతూ వచ్చింది. ప్రస్తుత ఇంధన మిశ్రమ విధానాన్ని మార్చే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదని ఖన్నా స్పష్టం చేశారు. "ఇప్పటివరకు ఏదీ ఫైనల్ కాలేదు. ఒకవేళ అది జరిగితే ఏం మార్పులు చేయాలి అని అడిగితే, మా దగ్గర పెద్దగా ఏమీ చేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈ20 కోసం అవసరమైన వ్యవస్థను ఇప్పటికే ఏర్పాటు చేశాం. ఈ20 నుంచి ఈ10కి మారాల్సి వస్తే అది పెద్ద విషయం కాదు. ఆ విషయంలో మా కంపెనీకి ఎలాంటి సవాలు కనిపించడం లేదు. ఏ ఆయిల్ కంపెనీకి కూడా ఈ20 నుంచి ఈ10కి మారడంలో సమస్య ఉండదు" అని ఆయన చెప్పారు. 10 శాతం ఇథనాల్ ఉన్న ఈ10 పెట్రోల్‌ను 20 శాతం ఇథనాల్ ఉన్న ఈ20తో పాటు అందుబాటులో ఉంచాలా అనే అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ఎక్కువ ఇథనాల్ ఉన్న పెట్రోల్ వల్ల వాహనాలపై ప్రభావం ఉంటుందా, ఇంధనం అందుబాటులో ఉండే విషయంలో ఏమైనా సమస్యలు వస్తాయా అనే ఆందోళనలను కొందరు వినియోగదారులు, పరిశ్రమ వర్గాలు వ్యక్తం చేశాయి. "ప్రస్తుతం వివిధ అంశాలను పరిశీలిస్తున్నారు. కానీ ఇప్పటివరకు ఏదీ ఫైనల్ కాలేదు. నిర్ణయం తీసుకున్న తర్వాత తప్పకుండా మీకు సమాచారం ఇస్తాం" అని ఖన్నా చెప్పారు. ఈ10ను మళ్లీ తీసుకొస్తే ఆయిల్ కంపెనీలు ఎలాంటి మార్పులు చేయాల్సి ఉంటుందని అడిగినప్పుడు, ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాల వల్ల పెద్ద సమస్య ఉండదని ఆయన చెప్పారు. అయితే ఇక్కడ రెండు విషయాల మధ్య తేడా ఉంది. ఒకటి ఈ20 నుంచి ఈ10కి పూర్తిగా మారడం. రెండోది ఈ20తో పాటు అదనంగా మరో రకం పెట్రోల్‌ను సరఫరా చేయడం. రెండోది పెద్ద లాజిస్టిక్స్ సవాలుగా మారే అవకాశం ఉంది. ముఖ్యంగా దేశవ్యాప్తంగా ఉన్న భారీ ఇంధన పంపిణీ వ్యవస్థను దృష్టిలో పెట్టుకుంటే ఈ సమస్య మరింత ముఖ్యమైనది. ఈ నెల ప్రారంభంలో కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్, ఆర్థిక వ్యవహారాల శాఖలో కన్సల్టెంట్‌గా ఉన్న ఆకాష్ పూజారి కలిసి రాసిన అభిప్రాయ వ్యాసంలో కీలక సూచన చేశారు. లక్షలాది పాత వాహనాలను దృష్టిలో పెట్టుకుని తక్కువ ఇథనాల్ కలిగిన పెట్రోల్ వేరియంట్‌ను భారత్ మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలని వారు చెప్పారు. 20 శాతం ఇథనాల్ ఉన్న ఈ20 పెట్రోల్ గత ఏడాది అందుబాటులోకి వచ్చింది. ఏప్రిల్ 1 నుంచి దేశవ్యాప్తంగా పెట్రోల్ బంకుల్లో విక్రయానికి ఉన్న ఏకైక పెట్రోల్ వేరియంట్‌గా ఈ20 కొనసాగుతోంది. దిగుమతి చేసుకునే చమురుపై ఆధారపడటాన్ని తగ్గించడం, దేశీయ వ్యవసాయ రంగానికి మద్దతు ఇవ్వడం, కాలుష్య ఉద్గారాలను తగ్గించడం కోసం ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. అయితే ముఖ్యంగా బీఎస్-6కు ముందు నిబంధనల కింద తయారైన వాహనాలు వాడుతున్న కొందరు వినియోగదారులు వాహన పనితీరు తగ్గిందని, ఆటో పార్ట్స్ దెబ్బతిన్నాయని చెబుతున్నారు. అయితే ఈ వాదనలో నిజం చాలా తక్కువగా ఉందని ప్రభుత్వం పలుమార్లు కొట్టిపారేసింది. ఒకేసారి పలు రకాల ఇంధనాలను సరఫరా చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్మించి నిర్వహించడం సాధ్యం కాదని ఆయిల్ మంత్రిత్వ శాఖ కూడా చెబుతూ వచ్చింది.

# డెబిట్ కార్డు లేకపోయినా నుంచి డబ్బులు తీసుకోవచ్చు..




డెబిట్ కార్డు ఇంట్లో మర్చిపోయినా నుంచి డబ్బులు తీసుకోవచ్చా? అవును.. సదుపాయం ఉన్న మీ ఫోన్‌తో స్కాన్ చేసి క్యాష్ విత్‌డ్రా చేసుకోవచ్చు. ఇంట్లో డెబిట్ కార్డు మర్చిపోయి బయటకు వచ్చారా? అత్యవసరంగా నగదు అవసరమైతే ఇక ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బ్యాంకు ఖాతాకు లింక్ అయిన యాప్ ఉంటే చాలు.. కొన్ని కార్డు ఉపయోగించకుండానే నగదు తీసుకునే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా పలు బ్యాంకుల ఇప్పుడు ఆధారిత కార్డ్‌లెస్ క్యాష్ విత్‌డ్రాయల్ సదుపాయాన్ని అందిస్తున్నాయి. ఈ ఫీచర్ గురించి కొంతకాలంగా చర్చ జరుగుతున్నప్పటికీ, అన్ని ప్రాంతాల్లో అందుబాటులోకి రావడానికి కొంత సమయం పట్టింది. ప్రస్తుతం ప్రముఖ బ్యాంకులకు చెందిన అనేక ాలవీల్లో ఈ సదుపాయం కనిపిస్తోంది. అయితే ప్రతి ద్వారా నగదు తీసుకునే అవకాశం ఉండదు. అందువల్ల ముందుగా క్యాష్ విత్‌డ్రాయల్ సదుపాయం ఉన్న గుర్తించడం అవసరం. కాకినాడ ఘటనలో ట్విస్ట్.. సాదిక్ కుటుంబం నుంచి సంచలన ఆరోపణలు..! ఈ తేదీల్లో పుట్టిన వారికి ఆకస్మిక ధన వర్షం.. వ్యాపారంలో భారీ లాభాలు! శని వక్రి ప్రభావంతో.. రాబోయే 100 రోజులు ఈ 3 రాశులకు సూపర్ టైమ్.. డబ్బుతో పాటు కీర్తి, గౌరవం! నెయ్యి ఎక్కువగా తింటున్నారా? మీకు ఈ లక్షణాలు ఉంటే అస్సలు ముట్టుకోకండి.. యమ డేంజర్ మొదట కార్డు అవసరం లేకుండా ద్వారా నగదు తీసుకునే సౌకర్యం ఉన్న ాలవీను ఎంచుకోవాలి లేదా దానికి సంబంధించిన ఆప్షన్‌ను ట్యాప్ చేయాలి. మీకు అవసరమైన మొత్తాన్ని ఎంటర్ చేయాలి. మొత్తాన్ని నమోదు చేసిన తర్వాత ాలవీ స్క్రీన్‌పై సాధారణ చెల్లింపుల మాదిరిగానే ఒక ప్రత్యేక కోడ్ కనిపిస్తుంది. మీ స్మార్ట్‌ఫోన్‌లో ఉన్న యాప్‌ను ఓపెన్ చేసి స్క్రీన్‌పై కనిపించే కోడ్‌ను స్కాన్ చేయాలి. స్క్రీన్‌పై చూపించిన మొత్తాన్ని మరోసారి పరిశీలించి, ఖాతాకు లింక్ అయిన సంబంధించిన నమోదు చేసి లావాదేవీని నిర్ధారించాలి. ప్రక్రియ పూర్తయిన తర్వాత ాలవీ నుంచి నగదు పొందవచ్చు. ఈ విధానం అందుబాటులో ఉండటంతో ప్రతిసారీ వాలెట్‌లో డెబిట్ కార్డు తీసుకెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. అయితే ఈ సౌకర్యాన్ని ఉపయోగించాలంటే రెండు విషయాలు తప్పనిసరి. ఒకటి యాప్‌తో బ్యాంకు ఖాతా లింక్ అయి ఉండాలి. రెండోది మీరు ఉపయోగించే క్యాష్ విత్‌డ్రాయల్ ఫీచర్ అందుబాటులో ఉండాలి. యాప్‌ను ఉపయోగించి ాలవీ నుంచి నగదు తీసుకునేందుకు అదనపు ఛార్జీలు లేవు అని సమాచారం. అంటే కార్డు చేతిలో లేకపోయినా ద్వారా అందుబాటులో ఉన్న నగదు తీసుకోవచ్చు. ఈ సేవ కోసం ఒకే ఒక్క యాప్‌ను ఉపయోగించాల్సిన అవసరం లేదు. కోడ్‌ను స్కాన్ చేసి నగదు విత్‌డ్రా చేసుకోవచ్చు. అయితే ఈ సదుపాయం దేశంలోని ప్రతి ఇంకా అందుబాటులో ఉండకపోవచ్చు. ముఖ్యంగా మెట్రో నగరాలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో లేదా తక్కువ సంఖ్యలో బ్యాంకింగ్ సదుపాయాలు ఉన్న చోట్ల క్యాష్ విత్‌డ్రాయల్ గుర్తించడం కొంత కష్టంగా ఉండొచ్చు. కాబట్టి కార్డు లేకుండా ప్రయాణించే ముందు సమీపంలోని అందుబాటులో ఉందో తెలుసుకోవడం మంచిది.

# చాట్‌జీపీటీలో మీ బిజినెస్ యాడ్ ఇవ్వొచ్చు... ఓపెన్‌ఏఐ కొత్త ఆఫర్




ఓపెన్‌ఏఐ భారత్‌లో చాట్‌జీపీటీ యాడ్స్‌ను ప్రారంభించింది. రోజుకు రూ.725 నుంచి బిజినెస్‌లు ప్రకటనలు ఇవ్వొచ్చు. ఫ్రీ, గో టియర్ యూజర్లకు యాడ్స్ కనిపిస్తాయి. భారత్‌లో చాట్‌జీపీటీ వాడుతున్న బిజినెస్‌లకు ఇది కీలకమైన వార్త. ఓపెన్‌ఏఐ దేశంలో చాట్‌జీపీటీ యాడ్స్‌ను ప్రారంభించింది. ఇక బిజినెస్‌లు రోజుకు రూ.725 నుంచి బడ్జెట్ పెట్టుకుని తమ ప్రకటనలను చాట్‌జీపీటీలో చూపించవచ్చు. అయితే ఈ యాడ్స్ అందరికీ కనిపించవు. మొదట్లో చాట్‌జీపీటీ ఫ్రీ, గో టియర్లను ఉపయోగిస్తున్న లాగిన్ అయిన పెద్దలకు మాత్రమే యాడ్స్ అందుబాటులో ఉంటాయి. ఓపెన్‌ఏఐ గురువారం భారత్‌లో చాట్‌జీపీటీ యాడ్స్ ప్రారంభించినట్టు ప్రకటించింది. కంపెనీకి పెద్ద, యాక్టివ్ మార్కెట్లలో భారత్ ఒకటి. ప్రస్తుతం ఫ్రీ, గో టియర్లలో లాగిన్ అయి చాట్‌జీపీటీ వాడుతున్న పెద్దలకు యాడ్స్ కనిపించొచ్చు. ప్లస్, ప్రో, బిజినెస్, ఎంటర్‌ప్రైజ్, ఎడ్యుకేషన్ సబ్‌స్క్రిప్షన్లు మాత్రం యాడ్స్ లేకుండానే కొనసాగుతాయి. సెప్టెంబర్ 4 నుంచి భారత్‌లో చాట్‌జీపీటీ యాడ్స్ మేనేజర్‌ను బిజినెస్‌లు స్వయంగా ఉపయోగించుకునే అవకాశం కూడా ఓపెన్‌ఏఐ కల్పించనుంది. బిజినెస్‌లు సైన్ అప్ చేసి, రోజుకు కనీసం రూ.725 బడ్జెట్‌తో యాడ్ క్యాంపెయిన్లు ప్రారంభించవచ్చు. భారత్‌లో చాట్‌జీపీటీ యాడ్స్‌కు డబ్ల్యూపీపీ, ఓమ్నికామ్ మొదటి ఏజెన్సీ భాగస్వాములుగా ఉండనున్నాయి. ఈ వారం భారత్‌లోనే 50కి పైగా బ్రాండ్లు చాట్‌జీపీటీలో తమ ప్రకటనలను ప్రారంభించే అవకాశం ఉందని ఓపెన్‌ఏఐ తెలిపింది. ఈ ఏజెన్సీ భాగస్వామ్యాల్లో యాడ్ వ్యూహం, క్రియేటివ్ పని, ఫలితాల కొలత, బ్రాండ్ సేఫ్టీ, క్యాంపెయిన్ నిర్వహణ వంటి అంశాలు ఉంటాయి. ఈ భాగస్వామ్యం ఒక్క ఏజెన్సీలకే పరిమితం కాదని ఓపెన్‌ఏఐ చెప్పింది. భవిష్యత్తులో ఇతర ఏజెన్సీలతోనూ పనిచేస్తామని తెలిపింది. ఓపెన్‌ఏఐలో గ్లోబల్ యాడ్స్ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్, హెడ్ దేవ్ డుగన్ మాట్లాడుతూ, "ప్రజలు చాట్‌జీపీటీని ఎలా ఉపయోగిస్తున్నారనే విషయంలో భారత్ ప్రపంచంలోనే చాలా వేగంగా మారుతున్న మార్కెట్లలో ఒకటి. మా వీక్లీ యాక్టివ్ యూజర్లు ఏడాది క్రితంతో పోలిస్తే రెట్టింపు అయ్యారు. వీరిలో చాలామంది సాధారణ సెర్చ్‌లకు మించి చాట్‌జీపీటీని ఉపయోగిస్తూ, నిర్ణయాలు తీసుకునే విధానాన్ని మార్చుకుంటున్నారు" అని చెప్పారు. "వాళ్లు ప్రశ్నలు అడుగుతున్నారు, ఆప్షన్లను పరిశీలిస్తున్నారు, ఒక్కో ఎంపిక వల్ల వచ్చే లాభనష్టాలను సంభాషణ ద్వారా బేరీజు వేసుకుంటున్నారు. చాట్‌జీపీటీ యాడ్స్ ద్వారా చిన్నదైనా పెద్దదైనా ప్రతి బిజినెస్ తమ ఉత్పత్తి లేదా సేవ గురించి ప్రజలు నిర్ణయం తీసుకోవడం మొదలుపెట్టిన సరైన సమయంలో వారికి పరిచయం చేసుకోవచ్చు" అని డుగన్ చెప్పారు. కైలాస్ మానసరోవర్ మార్గంలో మహా విషాదం.. 300 నుంచి 400 మంది భారతీయులు గల్లంతు.. చాట్‌జీపీటీ ఇచ్చిన సమాధానం కింద సంబంధిత స్పాన్సర్డ్ ప్రొడక్ట్ లేదా సర్వీస్ ఉంటే యాడ్ కనిపించవచ్చని ఓపెన్‌ఏఐ తెలిపింది. ఆ ప్రకటన స్పాన్సర్డ్ అని స్పష్టంగా లేబుల్ చేస్తారు. అలాగే చాట్‌జీపీటీ సమాధానాల నుంచి యాడ్స్‌ను ప్రత్యేకంగా కనిపించేలా ఉంచుతారు. ముఖ్యంగా, యాడ్స్ వల్ల చాట్‌జీపీటీ ఇచ్చే సమాధానాలు మారవని ఓపెన్‌ఏఐ స్పష్టం చేసింది.

# అఫ్గాన్‌తో టీ20 సిరీస్.. డాషింగ్ ఓపెనర్‌పై వేటు.. ఆటలో అరటి పండు రీ ఎంట్రీ..




భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు సోమవారం 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్గానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది. భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్గానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. జింబాబ్వే పర్యటనతో పాటు, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాట్‌తో రాణించడంలో విఫలమయ్యాడు. దీంతో అఫ్గానిస్తాన్ సిరీస్ నుంచి అతడిని తప్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తోంది అభిషేక్ శర్మ స్థానంలో కేరళకు చెందిన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న శాంసన్‌ను జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజా సిరీస్‌తో అతను మళ్లీ మెయిన్ స్క్వాడ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌కు పునరాగమనం చేయడం ఖాయం. అయితే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 2022 తర్వాత భువనేశ్వర్ భారత్ తరఫున మళ్లీ మ్యాచ్ ఆడలేదు. అయితే ఐపీఎల్ 2026లో ఆర్సీబీ (=జదీ) తరఫున అద్భుత స్వింగ్ బౌలింగ్‌తో మెరిసిన భువీ, ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లోనూ నిలకడగా వికెట్లు తీస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. త్వరలోనే బీసీసీఐ పూర్తి జట్టు వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.

# జురెల్‌కు గంభీర్, గిల్ గోల్డెన్ అడ్వైస్.. సెంచరీతో చెలరేగిన ధ్రువ్ జురెల్

శ్రీలంకతో జరుగుతున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత యువ ఆటగాడు ధ్రువ్ జురెల్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా బరిలోకి దిగి అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు. ఆగ్రాకు చెందిన ఈ 25 ఏళ్ల క్రికెటర్, గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అర్ధశతకం సాధించగా, ప్రస్తుతం కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అజేయ సెంచరీతో అదరగొట్టాడు. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు తరఫున సోమవారం అద్భుత బ్యాటింగ్‌ను ప్రదర్శించిన జురెల్, 115 పరుగులతో నాటౌట్‌గా నిలిచి భారత్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 503/9 వద్ద డిక్లేర్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. భారత్ తరఫున తన 11వ టెస్టు మ్యాచ్ ఆడుతున్న ధ్రువ్ జురెల్ ఇన్నింగ్స్‌పై అభిమానులు, క్రీడా నిపుణులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. రెండో రోజు ఆట ముగిసిన అనంతరం భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తనకు ఇచ్చిన సూచనలను జురెల్ వెల్లడించాడు. మూడో రోజు ఆట ప్రారంభానికి ముందు బీసీసీఐ (దీజజ×) విడుదల చేసిన ప్రత్యేక వీడియోలో జురెల్ మాట్లాడాడు. "కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నాతో ఎప్పుడూ ఒకటే చెబుతుంటారు.. వీలైనన్ని ఎక్కువ బంతులు ఆడాలి, మంచి భాగస్వామ్యాలు నెలకొల్పాలి, మ్యాచ్ పరిస్థితిని అర్థం చేసుకోవాలి, స్కోరింగ్ ప్రాంతాలను గుర్తించి అనవసరపు రిస్క్ లేకుండా బ్యాటింగ్ చేయాలని అంటారు" అని జురెల్ వెల్లడించాడు. కొలంబోలో సాధించిన ఈ శతకంతో ధ్రువ్ జురెల్ పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. శ్రీలంక గడ్డపై టెస్టు మ్యాచ్‌ల్లో 7వ స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్‌కు వచ్చి సెంచరీ నమోదు చేసిన రెండో భారత బ్యాటర్‌గా జురెల్ చరిత్ర సృష్టించాడు. విదేశాల్లో జరిగిన వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (ఔజ) మ్యాచ్‌లలో భారత్ తరఫున నంబర్ 7 లేదా ఆ దిగువన బ్యాటింగ్ చేసి అత్యధిక పరుగులు (115 నాటౌట్) చేసిన ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. మైలురాళ్లు అనేవి క్రీజులో నిలబడి ఎక్కువ సమయం బ్యాటింగ్ చేసినప్పుడు వాటంతట అవే వస్తాయని జురెల్ పేర్కొన్నాడు. రెండో రోజు ఆటలో తనతో కలిసి క్రీజులో ఉన్న బ్యాటర్‌తో భాగస్వామ్యం నిర్మించడమే తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. "మనం బ్యాటింగ్ చేస్తూ క్రీజులో ఎక్కువసేపు నిలిచినప్పుడు రికార్డులు, మైలురాళ్లు దానంతట అవే వస్తాయి. నాతో పాటు బ్యాటింగ్ చేస్తున్న వారితో భాగస్వామ్యాలను నిర్మించడమే నా ప్రణాళిక. రెండో రోజు మేం మెరుగ్గా ఆడామని భావిస్తున్నాను" అని జురెల్ ఆ వీడియోలో ముగించాడు౼



# డబ్బాలో బెల్లం జిగటగా మారుతోందా? ఈ సింపుల్ చిట్కాలతో ఎక్కువ రోజులు ఫ్రెష్‌గా ఉంచండి!



డబ్బాలో పెట్టిన బెల్లం కొన్ని రోజుల్లోనే తేమను పీల్చుకుని మెత్తగా మారుతుంది. దాని నుంచి నీరు రావడం మొదలవుతుంది. దీంతో బెల్లం చాలా జిగటగా మారి ఉపయోగించడం కూడా కష్టంగా ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో, గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తుంది. చక్కెరతో పాటు బెల్లానికి కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. చాలా రకాల తీపి వంటకాల్లో చక్కెరకు బదులుగా బెల్లాన్ని ఉపయోగిస్తారు. ముఖ్యంగా తెలుగు ఇళ్లలో లడ్డూ, పరమాన్నం వంటి అనేక వంటకాలను బెల్లంతోనే తయారు చేస్తారు. అందుకే వంటగదుల్లో బెల్లం తప్పకుండా కనిపిస్తుంది. రుచితో పాటు ఆరోగ్యానికి కూడా బెల్లం మంచిదని చాలామంది భావిస్తారు. అందుకే భోజనం తర్వాత నోరు శుభ్రం చేసుకోవడానికి చిన్న బెల్లం ముక్క తినే అలవాటు కూడా చాలా ఇళ్లలో ఉంటుంది. చక్కెరతో పాటు బెల్లానికి కూడా ఎంతో ప్రాధాన్యత ఉంది. చాలా రకాల తీపి వంటకాల్లో చక్కెరకు బదులుగా బెల్లాన్ని ఉపయోగిస్తారు. ముఖ్యంగా తెలుగు ఇళ్లలో లడ్డూ, పరమాన్నం వంటి అనేక వంటకాలను బెల్లంతోనే తయారు చేస్తారు. అందుకే వంటగదుల్లో బెల్లం తప్పకుండా కనిపిస్తుంది. రుచితో పాటు ఆరోగ్యానికి కూడా బెల్లం మంచిదని చాలామంది భావిస్తారు. అందుకే భోజనం తర్వాత నోరు శుభ్రం చేసుకోవడానికి చిన్న బెల్లం ముక్క తినే అలవాటు కూడా చాలా ఇళ్లలో ఉంటుంది. అయితే బెల్లాన్ని నిల్వ చేసేటప్పుడు మాత్రం చాలా మందికి ఇబ్బంది ఎదురవుతుంది. డబ్బాలో పెట్టిన బెల్లం కొన్ని రోజుల్లోనే తేమను పీల్చుకుని మెత్తగా మారుతుంది. దాని నుంచి నీరు రావడం మొదలవుతుంది. దీంతో బెల్లం చాలా జిగటగా మారి ఉపయోగించడం కూడా కష్టంగా ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో, గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తుంది. బెల్లం గాలిలోని తేమను త్వరగా పీల్చుకునే స్వభావం కలిగి ఉంటుంది. తేమకు ఎక్కువగా గురైనప్పుడు బెల్లం ఆకారం, గట్టితనం మారి క్రమంగా కరిగిపోవడం మొదలవుతుంది. సరైన పద్ధతిలో నిల్వ చేయకపోతే బెల్లానికి బూజు కూడా పట్టి త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది. బెల్లం ప్యాకెట్ తెరిచిన వెంటనే దాన్ని బయట ఉంచకుండా గాలి చొరబడని ఎయిర్‌టైట్ డబ్బాలో వేయాలి. ఇందుకోసం ప్లాస్టిక్ డబ్బాల కంటే మందమైన గాజు బాటిల్ లేదా గాజు జార్ ఉపయోగించడం మంచిది. దాని మూత గట్టిగా మూసుకునేలా ఉండాలి. అలా చేస్తే బయట ఉన్న తేమతో కూడిన గాలి లోపలికి వెళ్లకుండా ఉంటుంది బెల్లం డబ్బాను ఎప్పుడూ వంటగదిలో చల్లగా, పొడిగా, నీడగా ఉండే ప్రదేశంలో ఉంచాలి. గ్యాస్ స్టవ్ దగ్గర, సింక్ పక్కన లేదా ఆవిరి ఎక్కువగా వచ్చే మిక్సర్, కుక్కర్ దగ్గర బెల్లాన్ని పెట్టకూడదు. వేడి, ఆవిరి కారణంగా బెల్లం త్వరగా తేమను పీల్చుకుని నీరు వదలడం మొదలుపెడుతుంది. బెల్లం డబ్బాను ఎప్పుడూ వంటగదిలో చల్లగా, పొడిగా, నీడగా ఉండే ప్రదేశంలో ఉంచాలి. గ్యాస్ స్టవ్ దగ్గర, సింక్ పక్కన లేదా ఆవిరి ఎక్కువగా వచ్చే మిక్సర్, కుక్కర్ దగ్గర బెల్లాన్ని పెట్టకూడదు. వేడి, ఆవిరి కారణంగా బెల్లం త్వరగా తేమను పీల్చుకుని నీరు వదలడం మొదలుపెడుతుంది. చాలామంది బెల్లాన్ని ఫ్రిజ్‌లో పెడుతుంటారు. కానీ ఇలా చేయడం వల్ల ఫ్రిజ్‌లోని చల్లని గాలికి బెల్లం చాలా గట్టిగా మారవచ్చు. అలాగే ఫ్రిజ్ నుంచి బయటకు తీసినప్పుడు ఉష్ణోగ్రతలో అకస్మాత్తుగా మార్పు రావడం వల్ల బెల్లం ఉపరితలంపై నీటి బిందువులు ఏర్పడతాయి. దీంతో బెల్లం మరింత జిగటగా మారే అవకాశం ఉంటుంది. కాబట్టి బెల్లాన్ని సాధారణ ఉష్ణోగ్రతలో, పొడిగా ఉండే ప్రదేశంలో నిల్వ చేయడం మంచిది. చాలామంది బెల్లాన్ని ఫ్రిజ్‌లో పెడుతుంటారు. కానీ ఇలా చేయడం వల్ల ఫ్రిజ్‌లోని చల్లని గాలికి బెల్లం చాలా గట్టిగా మారవచ్చు. అలాగే ఫ్రిజ్ నుంచి బయటకు తీసినప్పుడు ఉష్ణోగ్రతలో అకస్మాత్తుగా మార్పు రావడం వల్ల బెల్లం ఉపరితలంపై నీటి బిందువులు ఏర్పడతాయి. దీంతో బెల్లం మరింత జిగటగా మారే అవకాశం ఉంటుంది. కాబట్టి బెల్లాన్ని సాధారణ ఉష్ణోగ్రతలో, పొడిగా ఉండే ప్రదేశంలో నిల్వ చేయడం మంచిది. బెల్లం పెద్ద ముక్కగా లేదా పెద్ద దిమ్మగా ఉంటే దాన్ని నేరుగా డబ్బాలో పెట్టకుండా అవసరానికి తగ్గట్టుగా చిన్న చిన్న ముక్కలుగా చేసుకోవచ్చు. ఆ ముక్కలను జిప్‌లాక్ బ్యాగ్‌లో వేసి, అందులోని గాలిని పూర్తిగా బయటకు తీసి బ్యాగ్‌ను మూసేయాలి. ఆ తర్వాత దాన్ని ఎయిర్‌టైట్ డబ్బాలో పెట్టి భద్రపరచాలి. బెల్లం మరీ గట్టిగా మారి కోయడానికి ఇబ్బందిగా ఉంటే, మైక్రోవేవ్‌లో కేవలం 10 నుంచి 15 సెకన్ల పాటు స్వల్పంగా వేడి చేయవచ్చు. అయితే ఎక్కువ సమయం వేడి చేయకూడదు.

# రెస్టారెంట్ స్టైల్ 'వెజ్ మంచూరియా' ఇంట్లోనే పర్ఫెక్ట్‌గా చేయండిలా.. క్రిస్పీగా, జ్యూసీగా!

రెస్టారెంట్‌లో దొరికేలా క్రిస్పీగా, జ్యూసీగా ˆజ మచు ూరియాను ఇంట్లోˆన తయారు చేసుకోవాలనుకుంటున్నారా? సరైన పదార్థాలు, పరె ్క్ట మంచూరియా బాల్స్, రుచికరమైన సాˆ తోˆ ˆ స్టా రెంట్ స్టైల్ వె ˆజ మంచూరియా ఎలా చేసుకోవాలో తెలుసుకోండి. ఇండో-చైనీస్ వంటకాల్లో పిల్లల నుండి పెద్దల వరˆ అందరిˆ త్య త ష్ఠ్మై వ స్టార్టర్ˆ ˆఎజ్ మంచూరియా'. బయట క్రిˆ్పగా, లోపల సాఫ్ట్‌గా ఉండే కూˆగారు ఱ బాల్స్‌ను ఘాటైన వెల్లుల్లి, సాస్‌ల మిశ్రమంలో టాస్ చేస్తే వచ్చే రుచి అద్భుతంగా ఉంటుందని అనుభవజ్ఞురాలైన ˆృహిణి సుజాత వివరిస్తున్నాˆ . ˆచాలామంది ఇంట్లో ˆˆ న్టప్పˆడ మచుయూరియా బాల్ ్న నూనె లోఫి పోవడం ˆలేదా మెˆ్తబడిపోవడం జరుగుతుంటుంది. సరైన కొలˆలతో రెస్టారెంట్ స్టైల్‌తో అదిరిపోˆ ˆసే ్రడై ˆవేజ మంచూరియాను ఇంట్లో ˆసే ఎలాసులభˆ రా తయారు చేసుకోవాలో ఆ పూర్తి వివరాలు ఇప్పుడు క్లియర్ గా తెలుసుˆ దాం



# చెవి లోపల ఎలాంటి వస్తువు పెట్టకుండా క్లీన్ చేయవచ్చు..



సహజంగా మైనం బయటకు వచ్చే ట్రిక్ ఇదే వర్షాకాలంలో చెవిలో మైనం పేరుకుందని కాటన్ బడ్స్, పిన్నులు లేదా ఇతర వస్తువులతో శుభ్రం చేస్తున్నారా? ఇలా చేయడం వల్ల ఇన్ఫెక్షన్లు, చెవి గాయాలు వచ్చే ప్రమాదం ఉంది. చెవిని సురక్షితంగా ఎలా శుభ్రం చేసుకోవాలి? వర్షాకాలంలో పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు ఇవే. చెవిలో పేరుకునే మైనాన్ని చాలామంది మురికిగా భావిస్తుంటారు. దాన్ని తొలగించేందుకు కాటన్ బడ్స్, అగ్గిపుల్లలు, పిన్నులు లేదా ఇతర పదునైన వస్తువులను చెవిలో పెట్టి శుభ్రం చేస్తుంటారు. అయితే ఇలా చేయడం వల్ల చెవులకు హాని కలిగే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాతావరణంలో తేమ పెరగడం వల్ల చెవుల్లో ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం కూడా ఎక్కువగా ఉంటుంది. డాక్టర్ రాజేష్ కుమార్ న్యూస్ 18 హిందీకి ఇచ్చిన వివరాల ప్రకారం, చెవిలో ఏర్పడే మైనం శరీరంలో సహజంగా జరిగే ప్రక్రియలో భాగమే. ఇది చెవి లోపలి చర్మాన్ని రక్షించడంతో పాటు దుమ్ము, ధూళి, ఇతర బయటి కణాలు లోపలికి వెళ్లకుండా అడ్డుకుంటుంది. సాధారణంగా చెవి తనంతట తానే మైనాన్ని క్రమంగా బయటకు పంపిస్తుంది. అందువల్ల చెవి లోపలికి వస్తువులు పెట్టి శుభ్రం చేయాల్సిన అవసరం ఉండదు. వర్షాకాలంలో గాలిలో తేమ ఎక్కువగా ఉండటం వల్ల చెవిలో ఫంగస్, బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయంలో తరచూ చెవులను కెలకడం వల్ల లోపలి చర్మంపై గీతలు, గాయాలు ఏర్పడవచ్చు. దీంతో ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది. అంతేకాదు, కాటన్ బడ్‌ను చెవి లోపలికి ఎక్కువగా పెట్టడం వల్ల మైనం మరింత లోపలికి వెళ్లే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో చెవిపోటుకు కూడా గాయం కావచ్చు. కాబట్టి చెవిలోకి కాటన్ బడ్స్ లేదా ఇతర వస్తువులను లోతుగా పెట్టడం మానుకోవడం మంచిది. వర్షంలో తడిసినా, స్నానం చేసిన తర్వాతైనా చెవి బయట భాగాన్ని మెత్తని, శుభ్రమైన వస్త్రంతో నెమ్మదిగా తుడుచుకోవచ్చు. అయితే చెవి లోపల నీరు, నూనె లేదా ఇతర పదార్థాలను పోయకూడదు. వైద్యుడు సూచించినప్పుడు మాత్రమే చెవిలో ఏదైనా ద్రావణాన్ని ఉపయోగించాలి. చెవిలో నిరంతరం దురద, నొప్పి, వినికిడి తగ్గడం, బరువుగా అనిపించడం లేదా నీరు, చీము వంటి ద్రవాలు కారడం ఉంటే నిర్లక్ష్యం చేయకండి. ముఖ్యంగా ఫంగల్ ఇన్ఫెక్షన్ అనుమానం ఉంటే ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించి పరీక్ష చేయించుకోవడం అవసరం. చెవులను శుభ్రంగా ఉంచడం అంటే వాటిని లోపలి వరకు కెలకడం కాదు. చెవి సహజంగా మైనాన్ని బయటకు పంపించే ప్రక్రియకు ఆటంకం కలిగించకుండా, బయట భాగాన్ని మాత్రమే శుభ్రంగా ఉంచడం మంచిది. వర్షాకాలంలో ఈ చిన్న జాగ్రత్తలు పాటిస్తే చెవి ఇన్ఫెక్షన్లు, ఇతర సమస్యల నుంచి రక్షణ పొందవచ్చు.

## మహేష్ బాబు పెరుగన్నం అస్సలు తినడంట.. దీని వెనుక సీక్రెట్ ఇదా? పెద్ద లాజిక్కే



మహేష్ బాబు పెరుగన్నం, బ్రెడ్, బర్గర్లకు ఎందుకు దూరంగా ఉంటారో తెలుసా? సూపర్ స్టార్ మహేష్ బాబు వయసు 50 దాటినా.. స్క్రీన్ మీద మాత్రం పాతికేళ్ల కుర్రాడిలా మెరిసిపోతుంటారు. ఆయన అందం, గ్లోయింగ్ స్కిన్ వెనుక ఉన్న సీక్రెట్ ఏంటా అని ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతుంటారు. అయితే మహేష్ బాబు పాటించే కఠినమైన డైట్ నియమాలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా మన సౌత్ ఇండియన్స్ ప్రాణంగా భావించే 'పెరుగన్నం'ను మహేష్ బాబు అస్సలు ముట్టుకోరట! సూపర్ స్టార్ మహేష్ బాబు వయసు 50 దాటినా.. స్క్రీన్ మీద మాత్రం పాతికేళ్ల కుర్రాడిలా మెరిసిపోతుంటారు. ఆయన అందం, గ్లోయింగ్ స్కిన్ వెనుక ఉన్న సీక్రెట్ ఏంటా అని ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోతుంటారు. అయితే మహేష్ బాబు పాటించే కఠినమైన డైట్ నియమాలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా మన సౌత్ ఇండియన్స్ ప్రాణంగా భావించే 'పెరుగన్నం'ను మహేష్ బాబు అస్సలు ముట్టుకోరట! ఆయన పెరుగన్నం, బ్రెడ్, బర్గర్లను ఎందుకు దూరం పెట్టారు? దీని వెనుక ఉన్న అసలైన సైంటిఫిక్ కారణాలను లిలి12 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న చందానగర్ మెడికవర్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ ఘుఎజు; హెపటాలజిస్ట్ డాక్టర్ సబ్బు సూర్య ప్రకాష్‌లిలి క్లియర్ గా విశ్లేషిస్తున్నారు. గతంలో ఒక ఇంటర్వ్యూలో మహేష్ బాబును బర్గర్, పేస్ట్రీ, పెరుగన్నం.. ఈ మూడింటిలో ఏది ఇష్టం అని అడిగితే.. "నేను వీటిలో ఏదీ తినను. చాలా కాలంగా డెయిరీ (పాలు, పెరుగు ఉత్పత్తులు), బ్రెడ్ పూర్తిగా మానేశాను. అప్పుడప్పుడు చాలా అరుదుగా స్వీట్ మాత్రమే తింటాను" అని చెప్పారు. కేవలం పీచు పదార్థాలు (ఫైబర్) ఎక్కువగా ఉండే కూరగాయలు, క్లీన్ ప్రోటీన్ మాత్రమే ఆయన డైట్‌లో భాగం చేసుకున్నారు. మహేష్ బాబు డైట్ వెనుక ఉన్న జీర్ణకోశ సైన్స్‌ను డాక్టర్ సబ్బు సూర్య ప్రకాష్ వివరిస్తూ ఆసక్తికర అంశాలను వెల్లడించారు. కూరగాయల్లో ఉండే సహజ పీచు పదార్థం మన ప్రేవుల్లో ఉండే మేలు చేసే బ్యాక్టీరియాకు అద్భుతమైన ఆహారంగా మారుతుంది. ప్రేవుల ఆరోగ్యం పర్‌ఫెక్ట్‌గా ఉంటే శరీరంలో ఇన్ఫ్లమేషన్ తగ్గుతుంది. దీనివల్ల చర్మంపై ముడతలు పడకుండా, మొటిమలు రాకుండా సహజమైన మెరుపు పెరుగుతుందని డాక్టర్ సూర్య ప్రకాష్ తెలిపారు. దీన్నే మెడికల్ పరిభాషలో 'గట్-స్కిన్ యాక్సిస్' అంటారు. పెరుగన్నం అందరికీ ప్రమాదకరమా? – డాక్టర్ సబ్బు సూర్య ప్రకాష్ క్లారిటీ.. మహేష్ బాబు మానేశారని ప్రతి ఒక్కరూ పెరుగన్నం తినడం పూర్తిగా ఆపేయాల్సిన అవసరం లేదని గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ స్పష్టం చేస్తున్నారు. లాక్టోస్ ఇంటాలరెన్స్, అజీర్తి, కడుపుబ్బరం సమస్యలు ఉన్నవారు మాత్రమే పాల ఉత్పత్తులను తగ్గించాలి. వైట్ రైస్‌లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునేవారు, షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలనుకునేవారు అన్నం పరిమాణాన్ని పరిమితం చేసుకోవాలి. పెరుగన్నం అందరికీ ప్రమాదకరమా? – డాక్టర్ సబ్బు సూర్య ప్రకాష్ క్లారిటీ.. మహేష్ బాబు మానేశారని ప్రతి ఒక్కరూ పెరుగన్నం తినడం పూర్తిగా ఆపేయాల్సిన అవసరం లేదని గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ స్పష్టం చేస్తున్నారు. లాక్టోస్ ఇంటాలరెన్స్, అజీర్తి, కడుపుబ్బరం సమస్యలు ఉన్నవారు మాత్రమే పాల ఉత్పత్తులను తగ్గించాలి. వైట్ రైస్‌లో కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండటం వల్ల బరువు తగ్గాలనుకునేవారు, షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలనుకునేవారు అన్నం పరిమాణాన్ని పరిమితం చేసుకోవాలి. సాధారణ ప్రజలకు మేలు.. ఆరోగ్యంగా ఉన్న సాధారణ వ్యక్తులు మితంగా నాణ్యమైన పెరుగును ఆహారంలో తీసుకోవడం వల్ల ప్రోబయోటిక్స్ లభించి జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మహేష్ బాబు లాంటి సూపర్ స్టార్స్ కెమెరా లెన్స్, గ్లామర్ స్క్రీన్ కోసం అత్యంత క్రమశిక్షణతో కూడిన క్లీన్ డైట్ పాటిస్తారు.

## శరీరంలో యూరిక్ యాసిడ్ పెరిగిపోయిందా? సహజంగా కరిగించే ఆ 6 అద్భుతమైన సూపర్ ఫుడ్స్ ఇవే!

రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగినప్పుడు అది కీళ్లలో స్ఫటికాలుగా పేరుకుపోయి తీవ్రమైన కీళ్ల నొప్పులు, వాపులు, గౌట్ సమస్యకు దారితీస్తుంది. శరీరంలో ప్యూరిన్లు విచ్ఛిన్నం కావడం వల్ల ఉత్పత్తి అయ్యే ఈ వ్యర్థాన్ని మూత్రపిండాలు సరిగ్గా బయటకు పంపలేనప్పుడు రక్తంలో యూరిక్ యాసిడ్ ప్రమాదకర స్థాయికి చేరుతుంది. అయితే రోజువారీ ఆహారంలో ప్యూరిన్లు తక్కువగా ఉండే, యూరిక్ యాసిడ్‌ను సహజంగా బయటకు పంపే కొన్ని అద్భుతమైన పోషకాహారాలను చేర్చుకుంటే ఈ సమస్యను సులభంగా అదుపు చేయవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. యూరిక్ యాసిడ్‌ను కరిగించే ఆ 6 సూపర్ ఫుడ్స్ పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. రక్తంలో యూరిక్ యాసిడ్ స్థాయిలు పెరిగినప్పుడు అది కీళ్లలో స్ఫటికాలుగా పేరుకుపోయి తీవ్రమైన కీళ్ల నొప్పులు, వాపులు, గౌట్ సమస్యకు దారితీస్తుంది. శరీరంలో ప్యూరిన్లు విచ్ఛిన్నం కావడం వల్ల ఉత్పత్తి అయ్యే ఈ వ్యర్థాన్ని మూత్రపిండాలు సరిగ్గా బయటకు పంపలేనప్పుడు రక్తంలో యూరిక్ యాసిడ్ ప్రమాదకర స్థాయికి చేరుతుంది. అయితే రోజువారీ ఆహారంలో ప్యూరిన్లు తక్కువగా ఉండే, యూరిక్ యాసిడ్‌ను సహజంగా బయటకు పంపే కొన్ని అద్భుతమైన పోషకాహారాలను చేర్చుకుంటే ఈ సమస్యను సులభంగా అదుపు చేయవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. యూరిక్ యాసిడ్‌ను కరిగించే ఆ 6 సూపర్ ఫుడ్స్ పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. నిన్స్' అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు యూరిక్ యాసిడ్‌ను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తాయి. క్రమం తప్పకుండా చెర్రీస్, స్ట్రాబెర్రీస్, బ్లూబెర్రీస్ తీసుకోవడం వల్ల కీళ్లలో పేరుకుపోయిన యూరిక్ యాసిడ్ స్ఫటికాలు కరిగి వాపు, తీవ్రమైన నొప్పుల నుండి ఉపశమనం లభిస్తుంది.





# అమెరికాలో ది ప్యారడైజ్ సెకండ్ సింగిల్ రిలీజ్

నేచురల్ స్టార్ నాని, 'దసరా' దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న మోస్ట్ అవేటెడ్ పాన్-వరల్డ్ చిత్రం 'ది ప్యారడైజ్'. ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ గ్లింప్స్, టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచగా, ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ 'ఆయా షేర్' చార్ట్‌బస్టర్‌గా నిలిచి శ్రోతలను ఉర్రూతలూగించింది. తాజాగా ఈ చిత్రం నుంచి సెకండ్ సింగిల్‌ను మరింత వినూత్నంగా విడుదల చేసేందుకు మేకర్స్ సరికొత్త ప్లాన్ సిద్ధం చేశారు. సంగీతంతో పాటు సరికొత్త పర్ఫార్మెన్స్‌లతో ట్రెండ్ సెట్ చేసే రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈసారి మరింత ప్రత్యేకమైన ఈవెంట్‌తో ముందుకు రానున్నారు. హై ఎనర్జీ ఫోక్ మాస్ ఆంథమ్‌గా రూపొందిన ఈ సరికొత్త పాటను ఆగస్ట్ 28న అమెరికాలోని డల్లాస్‌లో జరిగే అనిరుధ్ లైవ్ కాన్సర్ట్‌లో వేలాది మంది అభిమానుల మధ్య గ్రాండ్‌గా లాంచ్ చేయనున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం కోసం నేచురల్ స్టార్ నాని ఇప్పటికే డల్లాస్ చేరుకున్నారు. కాన్సర్ట్‌లో అనిరుధ్‌తో కలిసి నాని ప్రత్యక్షంగా సందడి చేయనుండటం విశేషం. లైవ్ కాన్సర్ట్ ప్రదర్శన అనంతరం ఆగస్ట్ 29న ఈ పాటను ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో అధికారికంగా విడుదల చేయనున్నారు.



# కియారాకి సౌత్ కలిసి రావడంలేదా?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వానీకి సౌత్ సినిమా పెద్దగా కలిసి రావడం లేదనే టాక్ వినిపిస్తోంది. అప్పట్లో కొరటాల శివ దర్శకత్వంలో సూపర్‌స్టార్ మహేష్‌బాబు సరసన నటించిన 'భరత్ అనే నేను' చిత్రం మాత్రమే దక్షిణాదిలో ఆమెకు మంచి విజయాన్ని అందించింది. ఆ తర్వాత ఆమె సినిమా చేసిన ప్రతిసారి ఏదో తేడా కొడుతోంది. అప్పట్లో మెగాస్టార్ రామ్‌చరణ్‌తో చేసిన 'వినయ విధేయ రామ', తదువాత అదే హీరోతో చేసిన 'గేమ్ చేంజర్' చిత్రాలు నిరాశపరిచాయి. తాజాగా పాన్ ఇండియా రాకింగ్ స్టార్ యశ్ సరసన నటించిన 'టాక్సిక్' కూడా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదనే టాక్ వస్తోంది. దీంతో 'భరత్ అనే నేను' మినహా సౌత్‌లో కియారా సినిమాలు అన్నీ వరుసగా నిరాశపరుస్తున్నాయి. ఇక త్వరలోనే కోలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నది ఈ భామ. ఓ తమిళ సినిమాకు ఓకే చెప్పానని.. త్వరలో వివరాలు వెల్లడిస్తానని ఇటీవల 'టాక్సిక్' సినిమా ప్రచారంలో తెలిపింది.

# అక్టోబర్ 16న రణబాలి

విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ "రణబాలి". ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాలు ఉన్న ఈ సినిమా అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ మూవీ రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ లో విజయ్ దేవరకొండ చేతిలో కత్తితో ఫెరోషియస్ గా కనిపించి ఆకట్టుకుంటున్నారు. "రణబాలి" రాకతో దసరా బాక్సాఫీస్ మరింత సందడిగా మారనుంది.



# 'రంభ ఊర్వశి మేనక' టైటిల్ సాంగ్ లాంచ్



అల్లరి నరేష్ ఫాంటసీ కామెడీ 'రంభ ఊర్వశి మేనక'తో అలరించబోతున్నారు. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వంలో, అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మించారు. సురభి, రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ హీరోయిన్స్ గా నటించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్ టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా టైటిల్ సాంగ్ రిలీజ్ చేశారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ టైటిల్ సాంగ్ రిలీజ్ చేస్తున్నాము. ఇప్పటివరకు నేను చేసిన సినిమాల్లో ఇది చాలా డిఫరెంట్. తప్పకుండా దీనికి మీరు సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు. ప్రిశా సింగ్ మాట్లాడుతూ ఈ సాంగ్‌కి అందరూ డాన్స్ చేస్తారు. ప్రతి ఒక్కరికీ ఈ పాట నచ్చుతుంది. సెప్టెంబర్ 4న అందరూ ఈ సినిమాని థియేటర్‌లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు. విష్ణుప్రియ మాట్లాడుతూ 'రంభ ఊర్వశి మేనక' చుట్టూ తిరిగే కథ ఇది. ఇప్పటివరకు రంభ, ఊర్వశి, మేనకలను ఒక డాన్స్‌కి లేకపోతే ఒక సన్నివేశానికి రావడం చూశాము. కానీ ఈ కథ మాత్రం చుట్టూ రంభ, ఊర్వశి, మేనకల చుట్టూనే తిరుగుతుంది. ఇలాంటి సినిమా చేయడం నాకు అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు.

# పొలిటికల్ యాక్షన్ డ్రామా LEGACY

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా, దర్శకుడు సాయి కిరణ్ దైదా దర్శకత్వంలో కలాహీ మీడియా పతాకంపై తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పొలిటికల్ యాక్షన్ డ్రామా LEGACY. యశ్వంత్ దగ్గుమాటి, సాయి కిరణ్ రెడ్డి దైదా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంజయ్ సాంబ్రాణి, వి.వి.ఎన్. ప్రసాద్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో విడుదలైన LEGACY అనౌన్స్‌మెంట్ టీజర్ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని కలిగించింది. విమర్శకుల ప్రశంసలు అందుకున్న 'పిండం' చిత్రాన్ని నిర్మించిన కలాహీ మీడియా నుంచి వస్తున్న రెండో చిత్రం కావడంతో LEGACYపై అంచనాలు మరింత పెరిగాయి. LEGACY ఒక ఇంటెన్స్ పొలిటికల్ యాక్షన్ డ్రామా. అధికారాన్ని వారసత్వంగా పొందడం మాత్రమే కాదు.. ఆ వారసత్వాన్ని కొనసాగించాలా? లేక తిరగరాయాలా? అనే ప్రశ్న చుట్టూ సాగే ఈ ఆసక్తికరమైన కథ డిసెంబర్‌లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రంలో విశ్వక్ సేన్ ఇప్పటివరకు చూడని విభిన్నమైన, శక్తివంతమైన అవతార్‌లో కనిపించనున్నారు. ప్రముఖ నటుడు కే కే మేనన్ అత్యంత శక్తివంతమైన ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు.



Prajajwala Telugu Daily: Printer, Publisher and Owned by APPIKONDA BHAVANI, (LATE) A. BHASKARA RAO, Adress : Plot no: H-142,Mahadevapuram Phase -3 Gajularamaram-I, Quthbullapur -Hyderabad -500055, prajajwala2026@gmail.com, Cell No. 9700070315, RNI No. APTEL 2010/33400